
## శాస్త్రవేత్త వీరభద్రన్‌కు క్రాఫోర్డ్ ప్రైజ్

భూ వాతావరణంపై సీఎఫ్సీల ప్రభావాన్ని కనుగొన్న ప్రథమ సైంటిస్టుగా రికార్డు






# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - బుధవారం 4 ఫిబ్రవరి 2026 | సంపుటి: 10 | సంచిక: 32 | పేజీలు: 8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM



## ఐఐటీ మద్రాస్ సమ్మర్ ఫెలోషిప్ ప్రోగ్రామ్





### కుదిరిన వాణిజ్య ఒప్పందం

# భారత్‌పై ప్రతీకార సుంకాల్ని 18 శాతానికి తగ్గిస్తున్నం




## అమెరికా వస్తువులపై సున్నా సుంకాలకు.. రష్యా చమురు కొనుగోలు నిలిపివేతకు మోడీ ప్రభుత్వం అంగీకరించింది

### ప్రధాని మోడీతో ఫోన్ చర్చల అనంతరం ట్రంప్ ప్రకటన

### 140 కోట్ల మంది తరఫున ట్రంపునకు కృతజ్ఞతలు ప్రకటించిన మోడీ

**వాషింగ్టన్, ఫిబ్రవరి 3:** భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ప్రతీకార సుంకాలనూ 18 శాతానికి తగ్గిస్తున్నామని వెల్లడించారు. అమెరికాపై విధిస్తున్న సుంకాలను సున్నా స్థాయికి చేర్చడానికి, రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపేయడానికి భారత్ అంగీకరించిందని తెలిపారు. ట్రంప్ ప్రకటనతో

...మిగతా 2లో

## సహనమే సత్ఫలితాన్నిచ్చింది

### వాణిజ్య ఒప్పందంపై ఎన్డీయే సమావేశంలో ప్రధాని

### మోడీని సత్కరించిన కూటమి ఎంపీలు



**ఢిల్లీ, ఫిబ్రవరి 3:** అమెరికాతో భారత్ కుదుర్చుకున్న చారిత్రక వాణిజ్య ఒప్పందంపై ఎన్డీఏ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడారు. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలపై ఎన్ని విమర్శలు వచ్చినా.. సహనంతో ఉన్నానని ఆయన అన్నారు. అగ్రరాజ్యంతో చేసుకుంటున్న ఈ ఒప్పందం వాణిజ్య చర్చలపై ప్రభుత్వ స్థిరమైన

...మిగతా 2లో

## ఇంత సడెన్‌గా ఎట్ల కుదిరింది?

### ప్రశ్నించిన రాహుల్ గాంధీ



**ఢిల్లీ, ఫిబ్రవరి 3:** వాణిజ్య ఒప్పందం విషయంలో అమెరికా ఒత్తిడికి ప్రధాని మోడీ లొంగిపోయారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ ఒప్పందం ద్వారా రైతుల కష్టాన్ని అమ్మేశారని విమర్శించారు. 'దాదాపు నాలుగు నెలలుగా నిలిచిపోయిన వాణిజ్య ఒప్పందం సోమవారం సాయంత్రం అకస్మాత్తుగా ఎందుకు ఖరారైందో మనం అర్థం చేసుకోవాలి. ఈ విషయంలో ప్రధానిపై తీవ్ర ఒత్తిడి ఉంది. అమెరికాలో వ్యాపారవేత్త అదానీపై కేసు వంటి వ్యవహారాలు దీనికి కారణం. వాణిజ్య ఒప్పందం విషయంలో ప్రధాని రాజీ పడ్డారు. రైతుల కష్టాన్ని, మొత్తం దేశాన్నే అమ్మేశారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

## అమెరికాతో వాణిజ్య ఒప్పందం.. చారిత్రక మైలురాయి: చంద్రబాబు



**అమరావతి:** అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి ఒక చారిత్రక మైలు రాయి అని సీఎం చంద్రబాబు అన్నారు. దీన్ని విజయవంతంగా పూర్తిచేసినందుకు ప్రధాని మోదీకి అభినందనలు తెలిపారు. టారిఫ్‌లను 18శాతంకు తగ్గించడం ప్రపంచంలోని రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. ఇది నిరంతర గ్లోబల్ వద్ధికి దోహదపడే దూరదష్టి నిర్ణయమని చెప్పారు. మోదీ నాయకత్వంలో భారత్ ఒక గ్లోబల్ ఆర్థిక శక్తిగా తన స్థానం మరింత పటిష్ఠం చేసుకుంటోందన్నారు. ఈ ఒప్పందం భారత ఎగుమతుల పోటీ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుందని చెప్పారు. ముఖ్యంగా ఏపీలోని యువత, రైతులకు విస్తత అవకాశాలను సష్టించనుందని చంద్రబాబు పేర్కొన్నారు.


## మోదీ నాయకత్వంలో భారత్‌కు ఇది గొప్ప విజయం: మంత్రి లోకేశ్

**అమరావతి:** భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్‌కు ఇది గొప్ప విజయమని పేర్కొన్నారు. దూరదృష్టి గల నాయకత్వంతో సాధించిన కీలక ముందడుగు అని అభివర్ణించారు. సుంకాల తగ్గింపు భారత ఎగుమతులు, తయారీ రంగానికి భారీ ఊతమిచ్చే నిర్ణయమన్నారు. దీని ద్వారా ఏపీ సముద్ర ఆహార ఎగుమతులు, ఎంఎస్ఎంఈలు లాభపడనున్నా యని పేర్కొన్నారు. భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడనుందని అభిప్రాయపడ్డారు. ఈ కీలక ఒప్పందాన్ని సాధించిన చర్చా బందాలకు, వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు లోకేశ్ అభినందనలు తెలిపారు.



### పొందూరు ఖాదీ బ్రాండ్..

## పూర్వ వైభవం వచ్చేలా పలు అభివృద్ధి పనులపై కేంద్ర మంత్రి సమీక్ష



**ఢిల్లీ, ఫిబ్రవరి 3:** శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలో జరుగుతున్న పలు అభివద్ధి కార్యక్రమాల ప్రస్తుత స్థితిపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, సంయుక్త కలెక్టర్ ఫార్మన్ అహ్మద్‌తో వర్చువల్ విధానంలో మంగళవారం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సమీక్ష

...మిగతా 2లో



### ఏఐ ఆధారిత క్రాప్..

# అతిపెద్ద ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా ఏపీ



### అధికారులతో సీఎం

**అమరావతి:** ఏపీని అతిపెద్ద ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా మార్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 18 లక్షల మంది రైతులు, 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు వచ్చారని అన్నారు. దీనిని సమర్థవంతంగా అమలు చేస్తూ 2030-31 నాటికి 40 లక్షల మంది రైతులు, 50 లక్షల ఎకరాలలో ప్రకృతి సాగు చేపట్టేలా చూడాలని స్పష్టం చేశారు. వ్యవసాయం, అనుబంధ శాఖలపై అధికారులతో సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, దీంతో రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గి, పంట ఉత్పత్తులకు అధిక ధర లభిస్తుందన్నారు. ప్రకృతి సాగు ఉత్పత్తుల నాణ్యత తెలిసేలా సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ సదుపాయం కల్పించాలన్నారు.

**క్రాప్ అడ్వయిజరీ 'భారత్ విస్తార్'**

సుభాష్ పాలేకర్‌తో రాష్ట్రమంతటా ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. ఏఐ ఆధారిత క్రాప్ అడ్వయిజరీ 'భారత్ విస్తార్' వంటి వాటిని రాష్ట్రంలోనూ వినియోగించుకోవాలన్నారు. యూఎస్, ఈయూతో ట్రేడ్ ఒప్పందం నేపథ్యంలో రాష్ట్రం నుంచి రొయ్యలు, ఎండుమిర్చి, మామిడి, వరి, ప్రాసెస్డ్ ఫుడ్ ఎగుమతులు పెంచుకునేందుకు మరింత అవకాశం కలిగిందని అధికారులు వివరించగా, అయితే నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చూడాలని సీఎం అన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించి కేంద్ర పాలసీలకు అనుగుణంగా రాష్ట్ర పాలసీలు ఉండాలని చెప్పారు. డిజి రైతు బజార్ యాప్‌ను సీఎం ఆవిష్కరించారు. ఈ సమీక్షలో వ్యవసాయ శాఖ మంత్రి కే అచ్చెన్నాయుడు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్.. కొత్త విధానాలపై చంద్రబాబు సమీక్ష

విశాఖ స్టీల్ ప్లాంట్ పురోగతిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్, వైజాగ్ స్టీల్ ప్లాంట్ సీఎండీ మనీష్ రాజ్ గుప్తా, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. విశాఖ ఉక్కు ఉత్పత్తిని పెంచేందుకు సహకరించిన యాజమాన్యం, కార్మికులు, ప్రభుత్వ అధికారులకు సీఎం అభినందనలు తెలిపారు.

**విశాఖ ఉక్కుకు పూర్తి సహకారం**

2024-25 సెకండ్ క్వార్టర్ లో కేవలం రోజుకు 9,215 టన్నుల మాత్రమే ఉత్పత్తి చేసిన విశాఖ ఉక్కు మూడు బ్లాస్ట్ ఫర్నేస్ లు పనిచేస్తుండడంతో హాట్ మెటల్ ప్రొడక్షన్ లో రోజుకు 19,401 టన్నుల ఉక్కు ఉత్పత్తి కి చేరుకుంది. ఆర్థికంగా నష్టాల

...మిగతా 2లో

## కల్తీ లడ్డూ వ్యవహారంలో నివ్వెరపోయే నిజాలు

### మంత్రి పయ్యావుల



**అమరావతి:** కల్తీ లడ్డూ వ్యవహారంలో నివ్వెరపోయే నిజాలు వెలుగు చూశాయని ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ మంత్రి వర్గ సమావేశం ముగిసిన తర్వాత మంత్రులతో కలిసి పయ్యావుల మీడియాతో మాట్లాడారు. మంత్రివర్గ సమావేశంలో అజెండా అంశాలు పక్కనపెట్టి మరీ తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారాన్ని సమావేశంలో చర్చించినట్లు తెలిపారు.

తిరుమల లడ్డూలో వాడే నెయ్యిలో కల్తీ జరుగుతోందని తెలిసినా గత వైకాపా పాలకులు మౌనంగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022లో వైకాపా హయాంలో వచ్చిన సీఎఫ్‌టీఆర్ నివేదికను కావాలనే తొక్కిపెట్టారని మండిపడ్డారు. నిబంధనలు సడలించి మరీ అక్రమాలకు గేట్లు తెరిచారని ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగా తప్పు చేసినందున రిపోర్టులో ఉన్నవారందరికీ నేరంలో భాగం ఉందని అభిప్రాయపడ్డారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో

...మిగతా 2లో

## అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకోవాలి: పవన్‌కల్యాణ్

**అమరావతి:** మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. కాకినాడతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి ఈ తరహా ఫిర్యాదులు అందాయని తెలిపారు. అధిక ధరలకు మద్యం విక్రయాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. దీనివల్ల ప్రభుత్వానికి కూడా చెడ్డపేరు వస్తుందన్నారు. ఎక్సైజ్ అధికారులు నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని.. అధిక ధరలకు విక్రయాలు చేపట్టే వారిపై చర్యలు తీసుకోవాలని పవన్ ఆదేశించారు.

## చట్టాలను పాటించకపోతే దేశం నుంచి వెళ్లిపోండి





### వాట్సాప్ మాతృ సంస్థ మెటాపై సుప్రీం ఆగ్రహం

**ఢిల్లీ, ఫిబ్రవరి 3:** ప్రైవసీ పాలసీ విషయంలో వాట్సప్ మాతృ సంస్థ మెటాపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 'మీరు మా దేశ గోప్యతతో ఆడుకోలేరు. మా డేటాలోని ఒక్క అంకెను కూడా పంచుకోవడానికి మేం అనుమతించం. ఒకవేళ దేశ చట్టాలను పాటించకపోతే భారత్ను వీడి వెళ్లొచ్చు' అని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు. 2021లో వాట్సప్ లో గోప్యతా విధానానికి సంబంధించిన ఓ పిటిషన్ పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. తమ వాణిజ్య ప్రయోజనాల కోసం వాట్సప్ వినియోగదారుల డేటాను మెటాతో పంచుకుంటోందని.. ఇది దోపిడీ కిందకే వస్తుందని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్

...మిగతా 2లో

## చమురు కొనుగోలు నిలిపివేతపై భారత్ మాకేమీ చెప్పలేదు

### పుతిన్ అధికార ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్






**మాస్కో, ఫిబ్రవరి 3:** తమ నుంచి చమురు కొనుగోళ్లు నిలిపివేయడంపై భారత్ ఎటువంటి అధికారిక సమాచారం ఇవ్వలేదని రష్యా స్పష్టం చేసింది. అమెరికాతో చమురు కొనుగోలు ఒప్పందం చేసుకున్నట్లు గానీ.. రష్యా నుంచి దిగుమతులు ఆపేస్తామని గానీ భారత్ చెప్పలేదని వెల్లడించింది. అమెరికాతో ట్రేడ్ డీల్లో భాగంగా రష్యా నుంచి చమురు దిగుమతులు నిలిపివేసి, వెనెజువెలా చమురును కొనుగోలు చేయడానికి భారత్ ముందుకొచ్చినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటన పై రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి డిమిత్రి

...మిగతా 2లో

మనం Manam



# చమురు కొనుగోలు నిలిపివేతపై భారత్ మాకేమీ చెప్పలేదు

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రకటన చేశారు. సుదీర్ఘకాలంగా భారత్ రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటోందని డిమిత్రి పెస్కోవ్ పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య వాణిజ్యం ముఖ్యమైన విషయమని అన్నారు. దీనిపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలను జాగ్రత్తగా విశ్లేషిస్తున్నామన్నారు. భారత్ తో ద్వైపాక్షిక సంబంధాలకు, వాణిజ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని, వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం చేసుకునేందుకు కృషి చేస్తామని ఆయన ప్రకటించారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు తగ్గించుకోవాలని భారత్పై అమెరికా ఒత్తిడి తీసుకువస్తోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ట్రేడ్ డీల్లో భాగంగా భారత్కు వెనెజువెలా చమురు విక్రయించడానికి సిద్ధమవుతోన్నట్లు ట్రంప్ ఇటీవల ప్రకటించారు.

యూఎస్ నియంత్రణలో ఉన్న వెనెజువెలా చమురును విక్రయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. భారత్ సైతం ఇందుకు అంగీకరించిందన్నారు.

# చట్టాలను పాటించకపోతే దేశం నుంచి వెళ్లిపోండి

(మొదటి పేజీ తరువాయి)

మెహతా కోర్టుకు తెలిపారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ.. మెటాను హెచ్చరించారు.

### ప్రైవసీ పాలసీ?

2021 జనవరిలో వాట్సప్ కొత్త ప్రైవసీ పాలసీని తీసుకొచ్చింది. దీని ప్రకారం.. యూజర్లు వాట్సప్ బిజినెస్ అకౌంట్లతో జరిపే సంభాషణకు సంబంధించిన సమాచారాన్ని ఫేస్ బుక్ తో పంచుకొనేందుకు అనుమతి లభిస్తుంది. కొత్త పాలసీకి అంగీకరించని వారి ఖాతాలను రద్దు చేస్తామని తొలుత హెచ్చరించింది. కానీ, దీనిపై తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తమైంది. ఇది వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని అభ్యంతరాలు వచ్చాయి. దీనిపై జోక్యం చేసుకొన్న కేంద్ర ప్రభుత్వం వెంటనే పాలసీ అమలును నిలిపివేయాలని ఆదేశించింది. ఐటీ చట్టంలోని నిబంధనలకు ఈ కొత్త పాలసీ పూర్తి విరుద్ధంగా ఉందని తేల్చి చెప్పింది. ఈ పాలసీపై దాఖలైన పిటిషన్పై తాజాగా విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం ఈ విధంగా హెచ్చరించింది.

# శాస్త్రవేత్త వీరభద్రన్కు క్రాఫోర్డ్ ప్రైజ్

## భూ వాతావరణంపై సీఎఫ్సీల ప్రభావాన్ని కనుగొన్న ప్రథమ సైంటిస్టుగా రికార్డు

**ఢిల్లీ, ఫిబ్రవరి 3:** భారత సంతతి వాతావరణ శాస్త్రవేత్త వీరభద్రన్ రామనాథన్ను భూ విజ్ఞానశాస్త్రంలో నోబెల్ గా భావించే క్రాఫోర్డ్ ప్రైజ్ వరించింది. కాలుష్య మేఘాలు, క్లోరోఫ్లోరో కార్బన్ (సీఎఫ్సీ)ల వంటి సూపర్ పొల్యూటెంట్లపై దశాబ్దాల పాటు చేసిన పరిశోధనకు ఆయనకు ఈ అవార్డును ఇస్తున్నట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది. రామనాథన్ 'నాసా'కు పనిచేస్తున్న సమయంలో కార్బన్ డయాక్సైడ్ కంటే ఫ్రిడ్జ్ లు, ఏరోసోల్స్లో ఉపయోగించే సీఎఫ్సీలే 10 వేల రెట్లు ఎక్కువగా భూ వాతావరణంలో ఉష్ణాన్ని పట్టి ఉంచుతాయని కనుగొన్నారు. దీంతో గ్లోబల్ వార్మింగ్ కు కార్బన్ డయాక్సైడే ప్రధాన కారణమని అప్పటి వరకూ ఉన్న భావనను ఆయన సమూలంగా మార్చేశారు.

### సికింద్రాబాద్లో ఉద్యోగం

తమిళనాడులోని మదురైలో రామనాథన్ జన్మించారు. చదువు తర్వాత తెలంగాణలోని సికింద్రాబాద్ లో ఉన్న ఓ రిఫ్రిజిరేటర్ల కర్మాగారంలో సీఎఫ్సీ విభాగం ఇంజినీర్ గా పనిచేశారు. అనంతరం అన్నామలై యూనివర్సిటీ, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్లో పైచదువులు చదువుకున్నారు. ఇండియన్ ఓషన్ ఎక్స్పెరిమెంట్ (ఇండోఎక్స్) పేరుతో నిర్వహించిన అంతర్జాతీయ అధ్యయనంలో ఆయన ప్రధానంగా దక్షిణాసియాపై దృష్టి సారించారు. ఇక్కడ కాలుష్య మేఘాలు (బ్రౌన్ క్లౌడ్స్) వాతావరణంలో పేరిగిపోయి భారత రుతుపవనాల ప్రభావాన్ని క్షీణింపజేస్తున్నాయని, హిమాలయాల్లోని హిమానీనదాలు కరిగిపోవడాన్ని వేగవంతం చేస్తున్నాయని కనుగొన్నారు. రామనాథన్ ప్రస్తుతం కాలిఫోర్నియా యూనివర్సిటీలోని స్క్రిప్స్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఓషనోగ్రఫీలో డిస్టింగ్విష్డ్ ప్రొఫెసర్ ఎమెరిటస్ హోదాలో ఉన్నారు. స్వీడన్ దేశపు స్టాక్ హోంలో మేలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఆయనకు క్రాఫోర్డ్ ప్రైజ్ తో పాటు రూ.8.23 కోట్లు రివార్డును ప్రదానం చేస్తారు.

# ఐఐటీ మద్రాస్ 'సమ్మర్ ఫెలోషిప్' ప్రోగ్రామ్

**చెన్నై, ఫిబ్రవరి 3:** ఐఐటీ మద్రాస్ వేసవిలో చేపట్టనున్న ఫెలోషిప్ ప్రోగ్రామ్కు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఆసక్తి కలిగినఅభ్యర్థులుమార్చి 2వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. రెండు మాసాల పాటు జరిగే ఈ సమ్మర్ ఫెలోషిప్ ప్రోగ్రామ్ మే 18న ప్రారంభమై జులై 17తో ముగియనుంది.

### నెలకు రూ.15 వేలు స్టైపెండ్

ఇంజినీరింగ్, మేనేజ్మెంట్, సైన్సెస్ లేదా హ్యుమానిటీస్ రంగాల్లో నాణ్యతతో కూడిన విద్యా పరిశోధనపై విద్యార్థుల్లో అవగాహన, ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో ఈ ప్రోగ్రామ్ అందిస్తోంది. ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.15వేలు చొప్పున స్టైపెండ్ చెల్లిస్తారు.

### ఎవరు అర్హులు?

బీఈ/బీటెక్/బీఎస్సీ (ఇంజినీరింగ్) మూడో సంవత్సరం లేదా ఇంటిగ్రేటెడ్ ఎంఈ/ఎంటెక్ ప్రోగ్రామ్లలో మూడు/ నాలుగో సంవత్సరం చదువుతున్నవారితో పాటు మంచి అకడమిక్ రికార్డు కలిగిన ఎంఈ/ఎంటెక్/ఎమ్మెస్సీ/ఎంఏ/ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

### హాస్టల్ వసతి..

ఈ రెండు నెలల కాలానికి లభ్యతను బట్టి హాస్టల్, మెస్ సదుపాయం కూడా ఉంటుంది. .

ఫెలోషిప్ ఆఫర్ చేస్తున్న ఇంజనీరింగ్ సబ్జెక్టులు..

ఏరోస్పేస్ ఇంజినీరింగ్
అప్లైడ్ మెకానిక్స్ అండ్ బయో మెడికల్ ఇంజినీరింగ్
బయో టెక్నాలజీ
కెమికల్ ఇంజినీరింగ్
సివిల్ ఇంజినీరింగ్
కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్
డేటా సైన్స్ అండ్ ఏఐ
ఇంజినీరింగ్ డిజైన్
ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్
మెకానికల్ ఇంజినీరింగ్
మెడికల్ సైన్స్ అండ్ టెక్నాలజీ
మెటలార్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్
ఇంజినీరింగ్
ఓషన్ ఇంజినీరింగ్

### సైన్స్ విభాగంలో..

పిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్
హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్
మేనేజ్మెంట్ స్టడీస్

# మణిపూర్ నూతన సీఎంగా యుమ్నం ఖేమ్చంద్ సింగ్



**ఇంఫాల్, ఫిబ్రవరి 3:** మణిపూర్లో రాష్ట్రపతి పాలనకు ఏడాది పూర్తికానున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కొత్త సీఎంగా భాజపా నేత యుమ్నం ఖేమ్చంద్ సింగ్ ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం. మంగళవారం ఆయన భాజపా శాసనసభాపక్ష నేతగా ఎన్నికయ్యారు. అలాగే, మహిళా నేత నెమ్చా కిప్జెన్ ఉప ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. మణిపూర్ ప్రస్తుత శాసనసభ పదవీకాలం 2027 వరకు ఉంది. 2023 మే నుంచి జాతుల మధ్య ఘర్షణలతో మణిపూర్ అట్టుడికింది. 250 మందికిపైగా మృతి చెందగా.. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. ఈ క్రమంలోనే గతేడాది ఫిబ్రవరిలో సీఎం బీరెన్ సింగ్ రాజీనామా చేయడంతో అక్కడ రాష్ట్రపతి పాలన విధించిన విషయం తెలిసిందే. బీరెన్ సింగ్ రాజీనామాతో ఏడాది కాలంగా సీఎం పోస్టు ఖాళీగా ఉండటంతో... తాజా పరిణామాల నేపథ్యంలో కొత్త సీఎంగా ఖేమ్చంద్ బాధ్యతలు చేపట్టనున్నట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. మణిపూర్ అసెంబ్లీలో మొత్తం 60 స్థానాలు ఉన్నాయి. ప్రస్తుతం 37 మంది భాజపా ఎమ్మెల్యేలు ఉన్నారు. నేషనల్ పీపుల్స్ పార్టీ నుంచి ఆరుగురు, కాంగ్రెస్, నాగా పీపుల్స్ ఫ్రంట్ల నుంచి ఐదుగురు చొప్పున, కుకీ పీపుల్స్ అలయన్స్ నుంచి ఇద్దరు, జేడీయూ నుంచి ఒకరు, ముగ్గురు స్వతంత్రులు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ఒక స్థానం ఖాళీగా ఉంది.

# భారత్పై ప్రతీకార సుంకాల్ని 18 శాతానికి తగ్గిస్తున్నం

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటిదాకా భారత్ ఉత్పత్తులపై పడుతున్న 50 శాతం(ఇందులో రష్యా నుంచి చమురు కొంటున్నందుకు విధించిన 25 శాతం అదనపు సుంకం ఉంది) సుంకాలు 18 శాతానికి తగ్గుతాయి. ప్రధాని నరేంద్ర మోడీకి సోమవారం ట్రంప్ ఫోన్ చేశారు. అనంతరం తన సోషల్ మీడియా వేదిక ట్రూత్లో ప్రకటన చేస్తూ.. 'నాకున్న గొప్ప స్నేహితుల్లో భారత ప్రదాని మోడీ ఒకరు. భారత్ కు ఆయన శక్తిమంతమైన, గౌరవప్రదమైన నాయకుడు. మేం చాలా విషయాలు మాట్లాడుకున్నాం. వాణిజ్యం, రష్యా- ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు, రష్యా చమురు కొనుగోలు నిలిపివేత, అమెరికా, వెనెజువెలా నుంచి భారత్ట మరింత చమురు కొనుగోలు వంటి అంశాలపై చర్చించాం. ఇది ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకగలదని అనుకుంటున్నా. మోడీపె గౌరవంతో ఆయన విజ్ఞప్తిమేరకు వెంటనే వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నా. అమెరికా ఉత్పత్తులను భారీగా కొనేందుకు భారత ప్రధాని కట్టుబడి ఉన్నారు. 500 బిలియన్ డాలర్లకు పైగా విలువైన ఇంధనం, టెక్నాలజీ, వ్యవసాయ ఉత్పత్తులు, బొగ్గు, ఇతర ఉత్పత్తుల కొనుగోళ్లకు అదనంగా మరిన్ని దిగుమతులకు ఆ దేశం సిద్ధంగా ఉంది. వారితో మాకున్న అద్భుతమైన బంధం మునుపెన్నడూ లేనంత బలంగా ముందుకు సాగనుంది. మోడీ, నేను అన్ని విషయాలను చక్కబెడుతున్నాం' అని ట్రంప్ ఆ పోస్టులో వివరించారు.

### 140 కోట్ల మంది భారతీయుల తరపున డొనాల్డ్కు చాలా చాలా ధన్యవాదాలు.. : మోడీ

ట్రంప్ ప్రకటనపై మోడీ స్పందించారు. భారత ఉత్పత్తులపై ఇక నుంచీ 18 శాతం అమెరికా సుంకమే అమలు కానుందని ప్రధాని మోడీ వెల్లడించారు. ఇది ఎంతో సంతోషకరమని ఎక్స్ లో వ్యాఖ్యానించారు. 'అద్భుత ప్రకటన చేసినందుకు 140 కోట్ల మంది భారతీయుల తరపున అధ్యక్షుడు ట్రంప్నకు చాలా చాలా ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. అయితే, ఆయన వాణిజ్య ఒప్పందం గురించి ప్రస్తావించలేదు. 'ప్రపంచంలోని రెండు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలు, అతి పెద్ద ప్రజాస్వామ్య దేశాలు కలిసి పని చేస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ఎన్నో అవకాశాలకు ద్వారాలు తెరుచుకుంటాయి. ప్రపంచ శాంతికి, సుస్థిరతకు, సుసంపన్నతకు ట్రంప్ నాయకత్వం ఎంతో కీలకం. శాంతి కోసం ఆయన చేసే ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతిస్తుంది.

రెండు దేశాల భాగస్వామ్యాన్ని అత్యున్నత స్థాయికి చేర్చేందుకు ఆయనతో సన్నిహితంగా కలిసి పని చేసేందుకు ఎదురుచూస్తున్నా' అని మోడీ వివరించారు. మోడీ, ట్రంప్ ఫోన్లో మాట్లాడుకున్నారని భారత్లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఎక్స్లో తెలిపారు. విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి ఎస్ జైశంకర్ మూడు రోజుల అమెరికా పర్యటన ప్రారంభమైన నేపథ్యంలో ఈ సంభాషణ ప్రాధాన్యం సంతరించుకుంది.

# ట్రేడ్ డీల్ కుదరడంలో కీలక పాత్రధారి గోర్

**ఢిల్లీ, ఫిబ్రవరి 3:** భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పంద చర్చల్లో కొంతకాలంగా నెలకొన్న ప్రతిష్టంభన ట్రంప్ ప్రకటనతో తొలగిపోయింది. ఈ నేపథ్యంలో సెర్గియో గోర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. భారత్లో అమెరికా రాయబారిగా జనవరిలో అధికారికంగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. ఇరుదేశాలమధ్య ద్వైపాక్షిక, వాణిజ్య బంధాన్ని మరోస్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఆ సమయంలో వెల్లడించారు. ట్రంప్ టారిఫ్లు, ఆయన చేసిన ప్రకటనలు రెండు దేశాల సంబంధాల్లో ఇబ్బందికర వాతావరణాన్ని సృష్టించగా.. రాయబారిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది సమయంలోనే భారత్-అమెరికా సంబంధాలను పునర్నిర్మించడంలో గోర్ కీలకపాత్ర పోషించారు. ఇరుదేశాల మధ్య బలమైన స్నేహం వల్లే ఈ ఒప్పందానికి అంగీకారం లభించిందని ఆయన జాతీయ మీడియాతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. ఇప్పటినుంచి రెండు దేశాల మధ్య కొత్త అధ్యాయం ప్రారంభం అవుతుందని అభివర్ణించారు.39 ఏళ్ల సెర్గియో.. ట్రంప్నకు వీర విధేయుడు. అందుకే అతితక్కువ కాలంలోనే ఆయన ట్రంప్ పరిపాలన విభాగంలో స్థానం సంపాదించగలిగారు. అత్యంత వివాదాస్పదమైన వ్యక్తుల్లో ఒకరైన సెర్గియో గోర్ (ట్చటజ్ఞో ఎొట)ను భారత్ అమెరికా రాయబారిగా, దక్షిణ, మధ్యఆసియాలో పర్యవేక్షకుడిగా నియమించడం అప్పట్లో దౌత్యవర్గాలను షాక్కు గురిచేసింది. గోర్ నియామకంపై భారత్లో మిశ్రమ స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. కానీ ట్రంప్ మాత్రం ''నా అజెండాను అమలుచేయడానికి నేను పూర్తిగా విశ్వసించే ఓ వ్యక్తి నాకు కావాలి. ఆ విషయంలో సెర్గియో గొప్ప రాయబారి అవుతాడు'' అని పొగడ్తల వర్షం కురిపించారు.

### 2020లో ప్రజల దృష్టిని ఆకర్షించి..

1990ల్లో గోర్ కుటుంబం అమెరికా కు వలస వచ్చింది. ఆయన తల్లిదండ్రులవి రష్యా మూలాలు. అమెరికా వచ్చిన కొంతకాలానికే గోర్కు పౌరసత్వం లభించింది. జార్జ్ వాషింగ్టన్ యూనివర్సిటీ గ్రాడ్యుయేట్ అయిన ఆయన.. 2008లో పొలిటికల్ సైన్స్, అంతర్జాతీయ వ్యవహారాల్లో పట్టా పొందారు. తొలినుంచి రిపబ్లికన్ పార్టీతో సంబంధాలు కొనసాగించిన గోర్.. రిపబ్లికన్ నేషనల్ కమిటీకి కమ్యూనికేషన్ అండ్ రీసెర్చ్ అనలిస్టొ పనిచేశారు. 2020లో ట్రంప్ హయాంలో విక్టరీ ఫైనాన్స్ కమిటీకి చీఫ్ ఆఫ్ స్టాఫ్గా నియమితులు కావడంతో అందరి దృష్టిని ఆకర్షించారు. తర్వాత ఆయన ట్రంప్నకు అత్యంత సన్నిహితుడిగా మారిపోయారు. 'మేయర్ ఆఫ్ మార్-ఎ-లాగో'గా నిక్నేమ్ను సంపాదించుకున్నారు. మార్-ఎ-లాగో అనేది ఫ్లోరిడాలోని ట్రంప్ రిసార్ట్ పేరు.

గోర్.. భారత్కు రాయబారిగా నియమితులు కాకముందు వైట్హౌస్లో పర్సనల్ డైరెక్టర్గా పనిచేశారు. ట్రంప్ (ౄ్ఘుజాఫీ ఖీటయఖుఇ) రాజకీయ అజెండాకు తగ్గట్టుగా నిర్ణయాలు అమలుచేశారు. ఇటీవల మీడియాతో మాట్లాడుతూ.. ట్రంప్, భారత ప్రధాని నరేంద్రమోదీల మధ్య స్నేహబంధం నిజమైందేనన్నారు. తమకు భారత్ తర్వాతే ఎవరైనా అని పేర్కొన్నారు.

# సహనమే సత్ఫలితాన్నిచ్చింది

(మొదటి పేజీ తరువాయి)

వైఖరికి నిదర్శనమన్నారు. ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ.. భారత్ మాత్రం ప్రయోజనం పొందుతోందన్నారు.

దేశంలో పారిశ్రామిక వృద్ధిని బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని మోడీ పేర్కొన్నారు. కొంతకాలంగా అమెరికాతో జరుగుతున్న వాణిజ్య చర్చల్లో అనేక సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. అయినప్పటికీ తమ ప్రభుత్వం వెనకడుగు వేయలేదన్నారు. గత దశాబ్దకాలంలో దేశంలో చాలా మార్పులు వచ్చాయని, పలు సంస్కరణలు మంచి ఫలితాలను ఇచ్చాయని తెలిపారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంలో చేసిన కృషికి గానూ ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోడీకి సన్మానం చేశారు.

# పూర్వ వైభవం వచ్చేలా పలు అభివృద్ధి పనులపై కేంద్ర మంత్రి సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

సమావేశం నిర్వహించారు. పలాస-కాశీబుగ్గ ఆర్వోబీ, కేంద్రీయ విద్యాలయం నిర్మాణం,10 కోట్ల సీఎస్ఆర్ నిధులతో శ్రీకూర్మం ఆలయ అభివృద్ధి పనులు, మూల పేట పోర్టు, శ్రీకాకుళం నగరంలో పార్కుల నిర్మాణం, శ్రీకాకుళం నుంచి సముద్ర తీరానికి మరో కొత్త రహదారి, పొందూరు ఖాదీ బ్రాండ్ కి పూర్వ వైభవం వచ్చే విధంగా చేసే కార్యక్రమాల కార్యాచరణను, ప్రస్తుత స్థితిని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంపూర్ణ సహకారంతో అనేక కీలక ప్రాజెక్టులు ఈ ఫిబ్రవరి నెలలోనే శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించబోతున్నట్లు మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. విలువ, నాణ్యత విషయంలో రాజీ పడకుండా కార్యక్రమాలు సాగాలని, ప్రాజెక్టులకు నిర్దేశిత గడువు విధిస్తూ సమీక్షలో కీలక సూచనలు చేశారు.



# విశాఖ స్టీల్ ప్లాంట్.. కొత్త విధానాలపై చంద్రబాబు సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

నుంచి లాభాల వైపు విశాఖ స్టీల్ ఉత్పత్తి సాధిస్తున్నది. అన్ని విభాగాల్లో కొత్త విధానాలు ప్రవేశ పెట్టి ప్లాంట్ ను మరింత బలోపేతం చేయాలని సీఎం సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి విశాఖ ఉక్కుకు పూర్తి స్థాయి సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు.

# కల్తీ లడ్డూ వ్యవహారంలో నివ్వెరపోయే నిజాలు

(మొదటి పేజీ తరువాయి)

అసలు సూత్రధారులను తేల్చేందుకు విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయించినట్టు చెప్పారు. తిరుమలలో ఇన్ని తప్పులు జరుగుతుంటే గత ప్రభుత్వ పెద్దలు ఎందుకు మౌనంగా ఉన్నారని పయ్యావుల ప్రశ్నించారు. ఈ తప్పుల్లో వారు భాగస్వాములుగా ఉన్నారని ఆధారాలు చెబుతున్నాయన్నారు.

''సీఎఫ్టీఆర్ఐ నివేదికపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నివేదిక సూచనల మేరకు చర్యలు తీసుకోని వారిని ఏమనాలి?కల్తీ నిర్ధారణ పరీక్ష వద్దనగానే సడలింపు ఇవ్వటం నేరాన్ని ప్రోత్సహించటమే. ఏ నేపథ్యంలో సీఎం చంద్రబాబు మాట్లాడారో గ్రహించాలి. లడ్డూల్లో కొబ్బరి, పందికొవ్వు, పామాయిల్, ఫిష్ ఆయిల్ ఉన్నట్టు ఎన్డీడీబీ నివేదిక ఇచ్చింది. ల్యాబ్ నివేదికలోని సమాచారం ప్రకారమే సీఎం మాట్లాడారు. తెలిసిన వాస్తవాలను సీఎం ప్రజల ముందు పెట్టాలా? వద్దా? తితిదే ప్రక్షాళనలో భాగంగా ఈవోగా శ్యామలరావును నియమించారు. నమూనాలను సీఎఫ్టీఆర్ఐకి అప్పటి ఈవో పంపించారు. 2022లో నివేదిక ఇస్తే దాన్ని సరిచేయకుండా ముందుకెళ్లారు. పాలసేకరణలో 3 నిబంధనలు పెట్టారు. 4లక్షల లీటర్ల పాలు సేకరించే సంస్థగా ఉండాలని నిబంధన ఉంది. సుబ్బారెడ్డి పీఏ చిన్న అప్పన్న భోలే బాబా డెయిరీకి వెళ్లారు. నకిలీ పత్రాలతో టెండర్లలో పాల్గొన్నారని తెలిసినా మౌనం వహించారు. చుక్కపాలు లేకుండా నెయ్యి చేయడంపై ప్రజల్లో చర్చ జరగాలి. నేరంలో భాగస్వాములపై చర్యలు తీసుకునేందుకే విచారణ కమిషన్. బ్రిటీష్ పాలకులు, నిజాం కూడా తిరుమల వ్యవస్థలోకి చొరబడలేదు'' అని పయ్యావుల అన్నారు.

తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారంలో పారదర్శత కోసమే ప్రభుత్వ ప్రయత్నం తప్ప.. రాజకీయ కోణం ఇందులో లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తిరుమల శ్రీవారి పవిత్రత కాపాడే ప్రయత్నమే కూటమి ప్రభుత్వం చేస్తోందన్నారు. తిరుమల లడ్డూలో కల్తీని వైకాపా సమర్థిస్తోందా అని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రశ్నించారు. 250కోట్ల అవినీతి కోసం భక్తుల మనోభావాలతో ఆడుకున్నారని మండిపడ్డారు. హిందూధర్మం మూలాలను దెబ్బతీసే విధంగా వైకాపా చర్యలు ఉన్నాయని దుయ్యబట్టారు.జ

# తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం.. అసలు సూత్రధారులను తేల్చేందుకు విచారణ కమిషన్

**అమరావతి:** తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. అసలు సూత్రధారులను తేల్చేందుకు విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మూడు గంటలపాటు కొనసాగిన క్యాబినెట్ భేటీలో సిట్ నివేదికపైనా చర్చ జరిగింది. ఆ నివేదికలో పాత్రధారులపైనే చర్యలకు సిట్ సిఫార్సు చేసిందని అభిప్రాయపడింది. సిట్ విచారణ, ఛార్జ్షీట్, ప్రభుత్వానికి సమర్పించిన అంశాల్లో తేడాలను మంత్రివర్గం గుర్తించింది. ఈ మూడింటిపై అధ్యయనం చేసి వాస్తవాల సమర్పణకు కమిషన్ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. విచారణలో ఉన్న వాస్తవాలు ఛార్జ్షీట్లో ఎందుకు నమోదు చేయలేదనే దానిపై సమావేశంలో చర్చ జరిగింది.

# 'పుర'పోరు ప్రశాంతంగా నిర్వహించాలి

- ఎన్నికల చట్టం ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- రాష్ట్ర పోలీసులకు డీజీపీ ఆదేశాలు

**హైదరాబాద్,ఫిబ్రవరి 3(మనం,ప్రత్యేక ప్రతినిధి):** మున్సిపల్ ఎన్నికలను చట్టం ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని డీజీపీ బి.శివధర్ రెడ్డి రాష్ట్ర పోలీస్ అధికారులకు అదేశాలిచ్చారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ ఎన్నికలు జరగనున్న ప్రాంతాల పోలీస్ కమీషనర్లు , జిల్లాల ఎస్పీలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు (ఎస్హెచ్ఓ) లతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ రాష్ట్రంలోని 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈక్రమంలో కొత్తగూడెం, కరీంనగర్, మహబూబ్నగర్, మంచిర్యాల, నిజామాబాద్, నల్గొండ, రామగుండం కార్పొరేషన్ల పరిధిలోని 414 వార్డులతో పాటు, 116 మున్సిపాలిటీల్లోని 2582 వార్డుల్లో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈనెల 11వ తేదీన పోలింగ్, 13 తేదీన కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించి రాష్ట్ర పోలీస్ శాఖకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని డిజిపి సూచించారు. ఏ రకమైన ఫిర్యాదులు గాని ,అవాంఛనీయ సంఘటనలు గాని జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.అనంతరం హైదరాబాద్ పోలీస్ లీగల్ అడ్వైజర్ శ్రీ రాములు మాట్లాడుతూ....చట్టం ప్రకారం ఓటర్లను ప్రభావితం చేయడం, ఒకరికే ఓటు వేయాలని ఒత్తిడి తీసుకురావడం లేదా నామినేషన్ వేయకుండా అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని, బాధితులపై సామాజికంగా, ఆర్థికంగా బహిష్కరణలు విధిస్తే చట్టరీత్యా కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీసేలా మద్యం పంపిణీ చేసినా, ఎక్సైజ్ చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా కనీసం ఆరు నెలల నుంచి రెండేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందనీ ,ఆయుధాల చట్టం ప్రకారం లైసెన్స్డ్ ఆయుధాలను కలిగి ఉన్న వారు నిబంధనల మేరకు పోలీస్ స్టేషన్లలో జమ చేయాలని, లేనిపక్షంలో ఒక ఏడాది నుంచి మూడేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష విధించాలని నిబంధనలు ఉన్నాయని వివరించారు.

### ఎన్నికల నిబంధనలు:

ఎన్నికల ప్రచార పర్వంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు అనుసరించాల్సిన నిబంధనల విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలని లీగల్ అడ్వైజర్ శ్రీ రాములు పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాలలో అనుమతి లేకుండా గోడలపై పోస్టర్లు అంటించినా, అశ్లీల ప్రకటనలు ప్రదర్శించినా వాటిని తొలగించడమే కాకుండా సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని తెలిపారు. అలాగే ధ్వని కాలుష్యాన్ని నియంత్రించేందుకు టౌన్ న్యూసెన్స్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాల్సి ఉందన్నారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా బహిరంగ ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్లు వాడటం చట్టరీత్యా నేరమన్నారు. ప్రచార వాహనాల విషయంలోనూ మోటార్ వాహనాల చట్టం-1988 కింద అనేక ఆంక్షలు అమల్లో ఉన్నాయనీ, ఎన్నికల ప్రచారానికి ఉపయోగించే వాహనాలకు రిటర్నింగ్ అధికారి నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి అని తెలిపారు.



# రంగాను చంపితే తప్పేంటన్న వ్యక్తిని.. పదవితో సత్కరించింది జగన్ కాదా: మంత్రి నిమ్మల

**అమరావతి:** వంగవీటి రంగాను రౌడీ అని దూషించి, ఆయన్ను చంపితే తప్పేంటని గతంలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వైకాపా నేత గౌతమ్రెడ్డికి ఫైబర్నెట్ ఛైర్మన్ పదవి ఇచ్చి సత్కరించిన చరిత్ర జగన్రెడ్డిదని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. రంగ హత్య కేసు నిందితులు నేడు వైకాపాలో ఉండి నీతులు చెబుతున్నారని మండిపడ్డారు. పేరు చివర 'రెడ్డి'ని చేర్చుకున్న ముద్రగడ పద్మనాభం.. కాపుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. జగన్ మెప్పు కోసం ఆయన తన స్థాయిని తగ్గించుకుంటున్నారని పేర్కొన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో రామానాయుడు సోమవారం విలేకరులతో మాట్లాడారు.

2014-19 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం కాపులకు ఇచ్చిన రిజర్వేషన్లను అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ రద్దు చేశారని గుర్తుచేశారు. 'చంద్రబాబుపై అంబటి రాంబాబు మురికి మాటలు మాట్లాడితే.. ఇది తప్పు అని జగన్ ఎందుకు చెప్పలేదు. వైకాపా హయాంలో సామాజిక మాధ్యమాల్లో చిన్న పోస్టు పెడితేనే జైలుకు పంపిన జగన్.. నేడు ఇంత దారుణంగా మాట్లాడిన వ్యక్తిపై పార్టీ పరంగా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? తిరుమల ప్రసాదంలో కల్తీ నెయ్యి కుంభకోణం నుంచి ప్రజల దష్టి మరల్చడానికి రాంబాబును జగన్ పావులా వాడుకుంటున్నార'ని నిమ్మల విమర్శించారు.

# ఐ-బొమ్మ రవి బెయిల్ పిటిషన్పై విచారణ వాయిదా

**హైదరాబాద్,ఫిబ్రవరి 3(మనం,ప్రత్యేక ప్రతినిధి):** సినిమాల పైరసీ కేసులో నిందితుడు ఐ-బొమ్మ రవి తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్పై విచారణను ఉన్నత న్యాయస్థానం శుక్రవారానికి వాయిదా వేసింది. ఐ బొమ్మ రవిపై సీసీఎస్ పోలీసులు 4 కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం చంచల్ గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. బెయిల్ మంజూరు చేయాల్సిందిగా నాంపల్లి కోర్టులో రవి పిటిషన్ దాఖలు చేసినప్పటికీ.. న్యాయస్థానం అంగీకరించలేదు. దీంతో నాలుగు కేసుల్లోనూ తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ గత నెల 21న హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ కేసులో సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తారని.. సమయం కావాలని రవి తరఫు న్యాయవాది కోరడంతో హైకోర్టు ఈ మేరకు తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

# దోపిడీ ప్రభుత్వాలపై రాజీలేని పోరాటం

- బీసీలను పావులుగా వాడుకుంటున్న టీడీపీ, వైసీపీ
- తిరుమలలో ప్రక్షాళన జరగాలి
- బీసీల హక్కుల కోసం బరిలోకి.. 22న బిసి మహాగర్జన
- 44% రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం ఆగదు
- టీటీడీ డెయిరీ పెడితే వెయ్యి గోవులు, 22 ఎకరాల భూమి ఇస్తా
- పాలకుల ఒత్తిడితోనే పీఠాధిపతులు మౌనం
- లోకేష్ సర్వశాఖా మంత్రిగా భూములు కట్టబెడుతున్నారు
- తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన మీట్ ది ప్రెస్ లో బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ ఫైర్



**తిరుపతి, ఫిబ్రవరి 3 మనం న్యూస్ :** ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై, దోపిడీపై తమ పోరాటం రాజీలేకుండా కొనసాగుతుందని భారతచైతన్య యువజన (బిసివై) పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్రయాదవ్ స్పష్టం చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో జరిగిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన పాల్గొని, మీడియా ప్రతినిధులు అడిగిన పలు కీలక ప్రశ్నలకు సమాధానమిచ్చారు. 2023 జూలై 23న స్థాపించిన బిసివై పార్టీ, ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగడమే లక్ష్యంగా పనిచేస్తుందని ఆయన పునరుద్ఘాటించారు.

### బీసీలపై దాడులు.. రెండు పార్టీల వైఫల్యం

గత పదేళ్లుగా ఆంధ్రప్రదేశ్ హత్యలు, దాడులకు కేరాఫ్ అడ్రస్గా మారిందని రామచంద్రయాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలపై దాడులు ఈరోజు కొత్తవి కావని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన దాడులను అందరూ చూశారని గుర్తుచేశారు. బీసీ నాయకుడినైన తనపైనే దాడి జరిగిందని, అప్పుడు దాడులు చేయించిన జగన్ మోహన్ రెడ్డి ఇప్పుడు బీసీల గురించి మాట్లాడటం దారుణమన్నారు. చంద్రబాబు గతంలో హామీ ఇచ్చిన 'బీసీ రక్షణ చట్టం'పై జగన్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సొంత పార్టీ బీసీ నాయకులు, కార్యకర్తలపై దాడులు జరుగుతున్నా జగన్ ప్రశ్నించకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. టీడీపీ, వైసీపీలు బీసీలను కేవలం పావులుగా వాడుకుంటున్నాయని, వారి ఓట్లతో గెలిచి వారిని విస్మరిస్తున్నాయని విమర్శించారు.

### తిరుమల పవిత్రత.. ప్రభుత్వాల నిర్లక్ష్యం

తిరుమలలో కల్తీ నెయ్యి వ్యవహారం తనను తీవ్రంగా బాధించిందని రామచంద్రయాదవ్ అన్నారు. కలియుగ దైవం విషయంలోనే ఇలా జరుగుతుంటే, మిగతా విషయాల్లో పరిస్థితి ఎలా ఉందోనని అనుమానం వ్యక్తం చేశారు. తిరుమలను ఆధ్యాత్మిక కోణంలో కాకుండా రాజకీయ, వ్యాపార కోణాల్లో చూస్తున్నారని, తక్షణమే ప్రక్షాళన జరిగి, స్వతంత్ర వ్యవస్థగా మారాలని డిమాండ్ చేశారు. స్వామివారి కళ్లు వారంలో ఆరు రోజుల పాటు మూసి ఉంచడం ఏ శాస్త్రంలోనూ లేదని, దీనిపై మాట్లాడటానికి చాలామంది భయపడుతున్నారని అన్నారు. దర్యాప్తు సంస్థలపై ఒత్తిడి కారణంగానే ప్రభుత్వానికి అనుకూల నివేదికలు వస్తున్నాయని ఆరోపించారు.

### టీటీడీకి డెయిరీ పెడితే వెయ్యి గోవులు, పుంగనూరులో 22 ఎకరాల భూమి ఇస్తా

కల్తీ నెయ్యి సరఫరా చేసిన కంపెనీలను సిఫారసు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా టీటీడీ సొంతంగా డెయిరీని ఏర్పాటు చేయాలని సూచించారు. టీటీడీ డెయిరీ ఏర్పాటు చేస్తే, తాను వెయ్యి గోవులను విరాళంగా ఇస్తానని ప్రకటించారు. ఒకవేళ పుంగనూరులో కూడా ఆ డెయిరీ శాఖను ఏర్పాటు చేస్తే, తన 22 ఎకరాల భూమిని సైతం ఉచితంగా ఇస్తానని హామీ ఇచ్చారు. గత ఏడాది పాదయాత్రతో తిరుమలకు వెళ్లి గోవులు ఇస్తానన్నా టీటీడీ ఇప్పటివరకు స్పందించలేదని గుర్తుచేశారు. ప్రభుత్వాల ఒత్తిడి వల్లే మఠాధిపతులు, పీఠాధిపతులు ఈ విషయాలపై స్పందించడం లేదని, వారంతా తిరుపతి కేంద్రంగా ఒక సదస్సు ఏర్పాటు చేసి హిందూ ధర్మ పరిరక్షణకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

### సర్వశాఖా మంత్రిగా లోకేష్... అన్నిశాఖల్లో వేలు పెడుతున్నాడు

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన శాఖను వదిలి 'సర్వశాఖా మంత్రి'గా వ్యవహరిస్తున్నారని, అన్ని శాఖల్లో వేలు పెడుతూ రాష్ట్ర భూములను 99 పైసలకే ప్రైవేటు కంపెనీలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. నిజంగా పెట్టుబడులు వస్తే తప్పులేదని, కానీ ఏ కంపెనీ రాకపోగా రాష్ట్ర భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని అన్నారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీల విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు పేద, బడుగు వర్గాల విద్యార్థులకు అన్యాయం చేసేలా ఉన్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే నేరుగా దాడులు చేయడం సరికాదని, చట్టానికి వ్యతిరేకంగా ఎవరు ప్రవర్తించినా చట్టపరంగానే చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. గతంలో జగన్కు, ఇప్పుడు కూటమికి ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. ఇలాంటి దాడుల వల్ల రాష్ట్రానికి పెట్టుబడులు రావని, జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

### బీసీ రిజర్వేషన్ల కోసం పోరాటం

రాజధాని ప్రాంతంలో బీసీలకు సంబంధించిన కంపెనీలకు వెయ్యి ఎకరాలు కేటాయించాలని, జనాభా ప్రాతిపదికన 44 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రామచంద్రయాదవ్ డిమాండ్ చేశారు. తెలంగాణాలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇస్తామంటే కుట్రపూరితంగా అడ్డుకున్నారని, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో బీసీ రిజర్వేషన్ల విషయంలో తమ పార్టీ స్పష్టమైన వైఖరితో ఉందని తెలిపారు. ఈ డిమాండ్ సాధన కోసం ఈ నెల 22న భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామని, రిజర్వేషన్లు సాధించే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు.

### స్వతంత్ర రాజకీయాలే మా పంథా

బిసివై పార్టీ ఏ పార్టీకి తోక పార్టీగా ఉండదని, తన ప్రాణం ఉన్నంతవరకు ఏ పార్టీలో విలీనం కాదని రామచంద్రయాదవ్ తేల్చిచెప్పారు. ప్రత్యామ్నాయ పార్టీగానే కొనసాగుతుందని, అందుకు మానసికంగా సిద్ధపడే రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 31, ప్రస్తుత కూటమి అధికారంలోకి వచ్చాక 16 అక్రమ కేసులు బనాయించారని, అవన్నీ తప్పుడు కేసులేనని అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబే చెప్పారని గుర్తుచేశారు. తాను ఏ నాయకుడునీ ఆదర్శంగా తీసుకొని రాజకీయాల్లోకి రాలేదని, సమాజంలోని పరిస్థితులే తనను రాజకీయాల వైపు ప్రేరేపించాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మురళి, ప్రధాన కార్యదర్శి బాలు, కార్యవర్గ సభ్యులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

# మోహన్ బాబు కుటుంబంలో కలహాలకు కారణం పిఆర్ఓ సతీష్

- రామానాయుడు
- కిడ్నాప్ స్పందించిన ఎస్పీ, కలెక్టర్ కు ధన్యవాదాలు

**తిరుపతి, ఫిబ్రవరి 3 మనం న్యూస్ :** విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ప్రాంగణంలో మనుషులను అదుపు చేసే బౌన్సర్లను ఏర్పాటు చేసుకోవడం ఏమిటని, విద్యార్థుల నుండి ఉన్నత విద్యా మండలి ప్రమాణాలకు విరుద్ధంగా అధిక ఫీజులను వసూలు చేయడం, ప్రశ్నించిన వారిని భయభ్రాంతులకు గురి చేయడం, విద్యార్థి సంఘాల నాయకులను కిడ్నాప్ లు చేయడం చూస్తుంటే మోహన్ బాబుకు విశ్వవిద్యాలయం, విద్యాలయాలను నడిపి హక్కు లేదని స్పష్టమవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మోహన్ బాబు విద్యాసంస్థలపై సమగ్రమైన దర్యాప్తు జరిపి, ఆ విద్యా సంస్థకు ఉన్న గుర్తింపును



రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, సిపిఐ రాష్ట్ర రైతు సంఘం నాయకులు రామానాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకులు అక్బర్, వినోద్ లను మోహన్ బాబు విశ్వవిద్యాలయానికి చెందిన బౌన్సర్లు తిరుపతి కలెక్టరేట్ వద్ద కిడ్నాప్ చేసి తీసుకెళ్లడంపై మాట్లాడారు. మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో బీటెక్ పూర్తయిన విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్మెంట్లో పాల్గొనాలంటే ప్రతి ఒక్క స్టూడెంట్ రూ.40 వేల రూపాయలు చెల్లించాలని, అదేవిధంగా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఉన్న అద్దె గదులలో విద్యార్థులు బస చేసి కళాశాలలో చదువుకుంటుంటే వారు ఒక్కొక్కరు రూ.20 వేల రూపాయలు చెల్లించే విధంగా అక్రమ పద్ధతిలో విశ్వవిద్యాలయం నడిపిస్తున్నారన్నారు. దీనిపై విద్యార్థి సంఘ నాయకులు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, ఫీజు రెగ్యులేటింగ్ కమిషన్ కు ఫిర్యాదు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం త్రీ మెన్ కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఆ కమిటీ విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేయడం వాస్తవమేని గుర్తించి అపరాధ రుసుముగా రూ.26 కోట్ల రూపాయలను ప్రభుత్వానికి చెల్లించాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో హైకోర్టుకు వెళ్లి స్టే తీసుకువచ్చి దీనిపై ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులను విశ్వవిద్యాలయం పిఆర్ఓ సతీష్ ద్వారా మంతనాలు జరిపి, ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లిస్తాము, ఈ విషయాలను బహిరంగపరచకండి అని ఒప్పందం చేసుకున్నారన్నారు. దీనిపై విద్యార్థి సంఘాలు నాయకులు కూడా కోర్టును ఆశ్రయించడం, నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో మంగళవారం జిల్లా కలెక్టర్ కు చిన్నపాటి నిరసన తెలిపి వినతి పత్రాన్ని అందించాలని వెళ్లిన ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్, ఉపాధ్యక్షులు వినోద్ లను మోహన్ బాబు విశ్వవిద్యాలయానికి చెందిన 3 కార్లలో వచ్చిన బౌన్సర్లు ఒక్కసారిగా వారిపై దాడి చేసి జాతీయ రహదారిపై కొట్టుకుంటూ వాహనాల్లోకి ఎక్కించి కిడ్నాప్ చేశారన్నారు. కిడ్నాప్ విషయం తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ సుబ్బరాయుడుకు, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కు తెలపడంతో యుద్ధప్రాతిపదకిన చర్యలు తీసుకొని ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నారావారి పల్లి వద్ద ఉన్న మోహన్ బాబు ఫామ్ హౌస్ లో ఉన్నట్లు పోలీసులు గుర్తించి వారిని విడిపించి తీసుకొచ్చారన్నారు. అప్పటికే విద్యార్థులను భౌతికంగా తీవ్రస్థాయిలో దాడులు చేయడంతో గాయాల పాలయ్యారన్నారు. సినిమాలలో విలన్ పాత్రలు పోషించిన మోహన్ బాబు ప్రజాస్వామ్యంలో విద్యార్థుల సమస్యలపై పోరాడుతుంటే అరిచి వేయడానికి ఇంతటి దురాగతానికి పాల్పడడం దారుణమన్నారు. నేర ప్రవృత్తి కలిగిన మోహన్ బాబు లాంటి వ్యక్తులకు విద్యాసంస్థలు నడిపే హక్కు ఏ మాత్రమూ లేదన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తిరుపతిలో ఎన్నడూ జరగని సంఘటన జాతీయ విద్యార్థి సంఘాల నాయకుల కిడ్నాప్ పై స్పందించి మోహన్ బాబు విశ్వవిద్యాలయం పై కఠిన చర్యలు తీసుకుంటూ, ఆ విద్యాసంస్థలను ప్రభుత్వం స్వాధీన పరచుకోవాలని డిమాండ్ చేస్తున్నమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విద్యార్థుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న వెంటనే విద్యార్థి సంఘాల పట్ల ఇంత దారుణంగా ప్రవర్తించిన మోహన్ బాబు విశ్వవిద్యాలయంపై చర్యలు తీసుకొని, ప్రభుత్వానికి చెల్లించాల్సిన అపరాధ రుసుమును చెల్లించే విధంగా చూడాలి. మోహన్ బాబు విశ్వవిద్యాలయం గుర్తింపును వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి లక్ష్మి డిమాండ్ చేశారు. జాతీయ విద్యార్థి సంఘం నాయకులను కిడ్నాప్ చేశారన్న విషయం తెలిసిన వెంటనే స్పందించి వారి ఆచూకీ లభించేలా కృషిచేసిన జిల్లా ఎస్పీ సుబ్బరాయుడుకు, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కు, ఏఎస్పి రవి మనోహరాచారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. తిరుపతిలో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నమన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఎం నాయకులు వేణుగోపాల్, టి.సుబ్రమణ్యం, జయచంద్ర, జి.బాలసుబ్రమణ్యం, సిపిఐ నాయకులు చిన్నం పెంచలయ్య, కేతారి రాధాకృష్ణ, జల్లి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# కళాశాలలో బౌన్సర్లు ఎందుకు?

- విద్యాసంస్థలు నడిపే నైతిక హక్కు మోహన్ బాబుకు లేదు
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి

**తిరుపతి, ఫిబ్రవరి 3 మనం న్యూస్ :** కిడ్నాప్ ఘటనను నిరసిస్తూ మంగళవారం తిరుచానూరు పోలీస్ స్టేషన్ వద్ద విద్యార్థి సంఘాలు, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మోహన్ బాబును తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా అనంతరం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ప్రాంగణంలో విద్యార్థులను అదుపు చేయడానికి బౌన్సర్లను ఏర్పాటు చేయడం ఏమిటని, ఇది పూర్తిగా ఉన్నత విద్యా మండలి నిబంధనలకు, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి తీవ్రంగా విమర్శించారు. విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయడం, ప్రశ్నించిన వారిని బెదిరించడం, విద్యార్థి సంఘాల నాయకులను కిడ్నాప్ చేయడం వంటి ఘటనలు చూస్తుంటే మోహన్ బాబుకు విద్యాసంస్థలు నడిపే హక్కు లేదని స్పష్టమవుతోందని అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కందారపు మురళి మాట్లాడుతూ, మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో చదువుకున్న బీటెక్ విద్యార్థులు క్యాంపస్ ప్లేస్మెంట్స్లో పాల్గొనాలంటే ఒక్కో విద్యార్థి నుంచి రూ.40,000 వసూలు చేస్తున్నారని, అలాగే విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఉన్న అద్దె గదుల్లో నివసించే విద్యార్థుల నుంచి ఒక్కొక్కరికి రూ.20,000 చొప్పున అక్రమంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇది పూర్తిగా విద్యా రంగంలో దోపిడీ విధానమని ఆరోపించారు. ఈ అక్రమాలపై ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకులు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, ఫీజు రెగ్యులేటింగ్ కమిషన్కు ఫిర్యాదు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం త్రీ మెన్ కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఆ కమిటీ దర్యాప్తులో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేసిన విషయం వాస్తవమేనని తేల్చి, అపరాధ రుసుముగా రూ.26 కోట్లను ప్రభుత్వానికి చెల్లించాలని స్పష్టం చేసిందన్నారు. ఈ క్రమంలో మంగళవారం జిల్లా కలెక్టర్కు వినతి పత్రం ఇవ్వడానికి వెళ్లిన ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్, జిల్లా ఉపాధ్యక్షులు వినోద్లను మోహన్ బాబు విశ్వవిద్యాలయానికి చెందిన బౌన్సర్లు మూడు కార్లలో వచ్చి తిరుపతి కలెక్టరేట్ వద్ద జాతీయ రహదారిపై దాడి చేసి, బలవంతంగా వాహనాల్లో ఎక్కించి కిడ్నాప్ చేయడం తీవ్ర




ప్రజాస్వామ్య విఘాతమని అన్నారు. కిడ్నాప్ విషయం తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లకు సమాచారం అందించడంతో వారు యుద్ధప్రాతిపదికన స్పందించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, నారావారిపల్లిలోని మోహన్ బాబు ఫామ్ హౌస్ వద్ద విద్యార్థులను గుర్తించి సురక్షితంగా విడిపించారని తెలిపారు. అయితే అప్పటికే విద్యార్థులపై తీవ్రంగా దాడులు చేయడంతో వారు గాయాల పాలయ్యారని పేర్కొన్నారు.

సినిమాల్లో విలన్ పాత్రలు పోషించిన మోహన్ బాబు, నిజ జీవితంలో కూడా విద్యార్థుల ప్రజాస్వామ్య పోరాటాలను అణిచివేయడానికి ఇంత దుర్మార్గానికి పాల్పడడం దారుణమని, నేరప్రవృత్తి కలిగిన వ్యక్తులకు విద్యాసంస్థలు నడిపే హక్కు ఏ మాత్రం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ ఘటనపై స్పందించి, తిరుపతిలో ఎన్నడూ జరగని విధంగా జాతీయ విద్యార్థి సంఘాల నాయకుల కిడ్నాప్పై కఠిన చర్యలు తీసుకోవాలని, మోహన్ బాబు విశ్వవిద్యాలయంపై సమగ్ర దర్యాప్తు జరిపి ఆ సంస్థ గుర్తింపును రద్దు చేయాలని, అవసరమైతే ప్రభుత్వమే స్వాధీన పరచుకోవాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విద్యార్థుల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఈ ఘటనపై చర్యలు తీసుకుని, ప్రభుత్వానికి చెల్లించాల్సిన అపరాధ రుసుమును వసూలు చేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి లక్ష్మి డిమాండ్ చేశారు.

కిడ్నాప్ ఘటనపై తక్షణమే స్పందించి విద్యార్థులను సురక్షితంగా విడిపించిన జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఏఎస్పీ రవి మనోహరాచారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి ఘటనలు తిరుపతిలో పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ విలేకరుల సమావేశంలో సిపిఎం నాయకులు వేణుగోపాల్, జయచంద్ర, జి. బాలసుబ్రమణ్యం, మాధవ్, బుజ్జి, సిపిఐ నాయకులు చిన్నం పెంచలయ్య, కేతారి రాధాకృష్ణ, జల్లి విశ్వనాథ్ తతదితరులు పాల్గొన్నారు.

# బీసీవై పార్టీ కి తలొగ్గిన రాష్ట్ర ప్రభుత్వం

## వక్ఫ్ భూముల భూ సేకరణ ఉపసంహరణ దిశగా అడుగులు

**తిరుపతి, ఫిబ్రవరి 3 మనం న్యూస్ :** గుంటూరు జిల్లా చినకాకాని గ్రామంలో గల గుంటూరు అంజుమన్-ఇ-ఇస్లామియా సంస్థకు చెందిన 71.57 ఎకరాల వక్ఫ్ భూములను భూ సేకరణ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయడం తీవ్ర ఆందోళన కలిగించింది.



ఈ నేపథ్యంలో జనవరి 19న బీసీవై పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ ముస్లిం సంఘాల నాయకులతో కలిసి వక్ఫ్ భూములను ప్రత్యక్షంగా పరిశీలించారు.

వక్ఫ్ భూముల టైటిల్స్ ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చలేమని, వక్ఫ్ చట్టాలకు అనుగుణంగా పీపీపీ మోడ్ లేదా లాంగ్ లీజు రూపంలో మాత్రమే వినియోగానికి ఇవ్వవచ్చని స్పష్టం చేస్తూ అధికారికంగా లేఖ పంపారు.

వక్ఫ్ చట్టాలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ భూ సేకరణను తక్షణమే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ డిమాండ్కు తలొగ్గిన రాష్ట్ర ప్రభుత్వం, వక్ఫ్ బోర్డు ద్వారా 71.57 ఎకరాల అంజుమన్ వక్ఫ్ భూములను పీపీపీ మోడ్ లేదా లాంగ్ లీజు కింద ఇవ్వడంపై బోర్డులో తీర్మానం చేసి పంపాలని ఆదేశిస్తూ మెమో జారీ చేసింది.

ఈ అంశాన్ని ఫిబ్రవరి 5న జరగనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు సమావేశం అజెండాగా చేర్చనున్నారు.

సమావేశంలో నిర్ణయం తీసుకొని తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు సమాచారం.

ఈ సందర్భంగా బోడె రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ-

ఈ వక్ఫ్ భూములను వక్ఫ్ లీజ్ రూల్స్-2014 ప్రకారం లాంగ్ లీజుకు మాత్రమే ఇవ్వాలి.

ఆ లీజు ద్వారా వచ్చే ఆదాయాన్ని అంజుమన్ సంస్థ ఆశయాలు, సామాజిక-విద్యా-సంక్షేమ కార్యక్రమాల అమలుకు వినియోగించాలి అని స్పష్టం చేశారు.

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ విషయంలో రాజీలేని పోరాటం కొనసాగుతుందని,

వక్ఫ్ చట్టాలకు విరుద్ధంగా జరిగే ఏ ప్రయత్నాన్నైనా ప్రజా ఉద్యమంగా అడ్డుకుంటామని పార్టీ స్పష్టం చేస్తుందని అన్నారు.

# చిత్తూరు జిల్లాలో రూ.100 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నాం



- ప్రతి నెల మొదటి వారం లోపు జిఎస్టి చెల్లించాలి
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

**చిత్తూరు, ఫిబ్రవరి 3 మనం న్యూస్ :** జిల్లాలో 100 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో లోని ప్రత్యేక సమావేశం మందిరంలో జిల్లాలో జిఎస్టి అమలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూపీఎం-అజయ్ పథకం కింద గృహ నిర్మాణ శాఖలో జరుగుతున్న అన్ని పనులను వెబ్ పోర్టల్లో తప్పనిసరిగా నమోదు చేసి, వాటికి సంబంధించిన జీఎస్టీ నమోదును పూర్తిస్థాయిలో, ఎలాంటి ఆలస్యం లేకుండా చేయాలని అధికారులను ఆదేశించారు.

జీఎస్టీ చెల్లింపులకు సంబంధించి దరఖాస్తులు చేసినప్పటికీ ఆలస్యం జరుగుతుండటంతో చెల్లింపులు మరియు డేటాపై ప్రభావం పడుతోందని తెలిపారు. చిన్న మొత్తాల పనులకైనా శాఖల మధ్య సమన్వయం అవసరమని, అధికారులు పరస్పరం మాట్లాడుకుని సమస్యలను పరిష్కరించాలని కోరారు.

నకిలీ పన్ను చెల్లింపుదారులు గుర్తించాలని ఎఖీఖీ అధికారులను ఆదేశించారు.

కుప్పం నియోజకవర్గంలో సుమార్లు 29 కోట్ల విలువైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. వీటిలో ఎస్సీ/ఎస్టీ కాలనీలు, పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్, హాస్టళ్ల నిర్మాణాలు తదితర అభివృద్ధి పనులు ఉన్నాయని పేర్కొన్నారు.

(CT) శాఖ ద్వారా గుర్తించబడి, బకాయిలు ఉన్న పన్ను చెల్లింపుదారుల పన్ను లావాదేవీలను నిషేధించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు, డిఆర్ఓ, రిజిస్ట్రేషన్ అధికారి, సబ రిజిస్టర్ ఆధ్వర్యంలో

కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించాలని సూచించారు. దీని ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న రిజిస్ట్రేషన్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు.

ప్రభుత్వ పన్నులు సకాలంలో చెల్లించాలి. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను 31.3.26వ తేదీ లోపల ప్రణాళిక ప్రకారం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మోహన్ కుమార్, జాయింట్ కమిషనర్ కమర్షియల్ టాక్స్ అధికారి రవీంద్రనాథ్ రెడ్డి, డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ పరదేశి నాయుడు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశీ విత్తనాలకు ప్రత్యేక మద్దతు ధర కల్పించాలి



**మడకశిర, ఫిబ్రవరి 03,మనంన్యూస్ :** దేశీ మరియు సహజ విత్తనాలతో పండించే వ్యవసాయ ఉత్పత్తులకు ప్రభుత్వాలు ప్రత్యేక కనీస మద్దతు ధర (ఎం ఎస్ పి) కల్పించి, ప్రకృతి వ్యవసాయాన్ని పెద్దపీట వేయాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖ మంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ ఎన్. రఘువీరారెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్లో దేశీ విత్తనాలపై జరిగిన వర్క్ షాప్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన చేతుల మీదుగా 'విత్తన పండుగ' పోస్టర్ను ఆవిష్కరించారు.



ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ విత్తన గ్రామాలు ప్రతి మండలంలో ఒక 'విత్తన గ్రామాన్ని' అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం దేశీ విత్తనాల పరిరక్షణలో సీజీఆర్ (సిజిఆర్) వంటి పౌర సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రభుత్వాలే చొరవ తీసుకొని ఇలాంటి సంస్థలను ప్రోత్సహించాలని అయన కోరారు. ఆరోగ్య భారతం కోసం రసాయన రహిత వ్యవసాయం ద్వారానే ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందుతుందని ఆయన ఆకాంక్షించారు.డెక్కన్ డెవలప్ మెంట్ సొసైటీ ద్వారా చిరు ధాన్యలతో చేసిన వివిధ రకాల వంటకాలను రుచి చూడాల్సిందిగా ఆ సంస్థకు చెందిన ప్రతినిధి లక్ష్మమ్మ కోరడంతో అయన సరే ఆనండొతో కొర్రల కిచుడి,సామల పాయసంను రఘువీరారెడ్డికి లక్ష్మమ్మ స్వయంగా తినిపించి రుచి చూపించారు.ఈ సందర్బంగా రఘువీరా రెడ్డికి రైతు ప్రతినిధులు,ప్రెస్ కౌన్సిల్ ప్రతినిధులు తదితరుల ఆధ్వర్యంలో శాలువా కప్పి పూలమాన వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు రైతునేస్తం వెంకటేశ్వరరావు, దొంతి నర్సింహారెడ్డి, కృష్ణప్రసాద్ (సహజ సమృద్ధ), లక్ష్మమ్మ (డీడీఎస్), లీలారెడ్డి, లక్ష్మారెడ్డి (సీజీఆర్), సమాచార చట్టం మాజీ కమిషనర్ దిలీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పొగమంచు వేకువలో...

ఒకసారి- పొగమంచు కప్పేసిన వేకువలో...
పాటల పక్షులు ఇంపుగా పాడుతున్న ఆ చోట,
మంచుబిందువులు సాలెగూళ్ళకు అతుక్కుని
అవి- వెండిదారాల పైన ముత్యాల వలే
మెరుస్తున్నాయి!

సీతాకోకచిలుకలు చూడసొంపుగా
నాట్యం చేస్తున్న చోట,
అడవిపూలు చైతన్యకళతో వికసిస్తున్నాయి;
ప్రకృతిమాత కడుపు లోపల (అరణ్య మధ్యాన)
తెల్లటితోక గల జింక-
ఉత్సాహంగా,రమణీయంగా
గంతులు వేస్తోంది!

రేపనేది స్పృహకే రాని ఈ (అడవి)భూమిలో
నీ చింతలన్నీ కరిగిపోయి
జాడకు లేకుండా పోతాయి
క్రిందికీ,పైకీ ఊగే చెట్ల కొమ్మలతో
వచ్చే గాలులతో
నీ దుఃఖాలన్నీ తేలుతూ దూరంగా వెళ్ళిపోయి
మటుమాయ మవుతాయి!

నేను నా కళ్ళను మూసుకుని
గాలిని ఒకపరి పీల్చుకున్నాను;
సంతోషం నిండిన కన్నీళ్లు ధారాప్రవంతిగ
నా ముఖం పైకి ప్రవహించాయి;
ఇక ముందుకు నడక ప్రారంభించాను నేను,
కానీ ఈ పవిత్రనిర్మలప్రాంత సౌందర్యం నన్ను
మళ్ళీ అధిగమించి,
కదలకుండా నిలబెట్టి ముంచెత్తేసింది!!!

ఆంగ్లమూలం: జిమ్మీ ఓస్బోర్న్
**స్వేచ్ఛానువాదం: రఘువర్మ**
9290093933

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

# సంక్షోభం నుండి ప్రగతి దిశగా...



దేశంలో అన్ని రంగాలకు ఆర్థిక వెన్నుముక విద్యుత్ రంగం. దేశ స్వాతంత్రానికి ముందు బ్రిటిష్ పాలనలో విద్యుత్ అనేది ధనికులు, ఉన్నత వర్గం, ప్రభుత్వ కార్యాలయాలకు మాత్రమే ఒక విలాసవంతమైన సేవగా దొరికేది. స్వాతంత్రానంతరం అన్ని వర్గాల ప్రజలకు అవసరంగా అందుబాటులో రావడానికి భారత ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ఉమ్మడి జాబితాలో చేరుస్తూ రాష్ట్రాలకు కూడా విద్యుత్ రంగంపై విస్తృత అధికారాలను కల్పించింది. ఆయా రాష్ట్రాలు వారి అవసరాల నిమిత్తం విద్యుత్ ఉత్పత్తి సరఫరా పంపిణిలకై రాష్ట్ర ఎలక్ట్రిసిటీ బోర్డులను ఏర్పాటు చేసే అవకాశం కల్పిస్తే దీనిలో భాగంగా అన్ని రాష్ట్రాలు రాష్ట్ర ఎలక్ట్రిసిటీ బోర్డులను ఏర్పాటు చేసుకున్నాయి. వీటి పరిధిలో ప్రతి రంగంలోని వినియోగదారులకు విద్యుత్ను అందించడానికి కృషి చేశాయి. ఈ క్రమంలో స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డులన్ని ఆదాయ ఖర్చులలో వత్యాసంతో ప్రతి సంవత్సరం నష్టాలను చవి చూస్తూ అప్పుల్లో కూరుకు పోయాయి. వీటిని అప్పుల ఉబి నుండి తీసుకు రావడానికి వివిధ సంస్కరణలు తీసుకొచ్చిన, వీటిలో భాగంగా అప్పటి వరకు ఒకే ఉమ్మడిగా ఉన్న స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డులన్నీ విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణి సంస్థలుగా విడి పోయాయి. ఇలా సంస్థలుగా వికేంద్రీకరణ అయిన తరువాత ఉత్పత్తి, సరఫరా సంస్థలు కొద్దిగా ఆర్థికంగా మెరుగ్గా ఉన్న వినియోగదారుల, ప్రభుత్వ సబ్సిడీలతో ప్రత్యక్ష సంబంధం ఉన్న పంపిణి సంస్థలు మాత్రం ఏటా అప్పుల్లో కూరుకు పోతున్నాయి. వీటిని అప్పుల ఊబిలో నుండి బయటకు తీసుకు రావడానికి ప్రభుత్వాలు తమ బాధ్యతగా ఉదయ్, రివ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టర్ స్కీమ్, ఇంటిగ్రేటెడ్ పవర్ డెవలప్మెంట్ స్కీమ్, ఎల్‌పిఎస్ వంటి ఆర్థిక భరోసానిచ్చే పథకాలను తీసు కొస్తూ డిస్కంల పనితీరును, ఆర్థిక స్థితిని కేంద్ర ప్రభుత్వం పర్య వేక్షిస్తూ వస్తుంది. 2012 సంవత్సరం నుండి విద్యుత్ పంపిణీ సంస్థల యొక్క ఆర్థిక, పరిపాలన విషయాల మీద భారత ప్రభుత్వ ఇందన మంత్రిత్వ శాఖ రేటింగ్ ఇస్తు వస్తుంది. దీనికి నోడల్ ఏజెన్సీగా పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థను నియ మించింది. ఈ సంస్థ ప్రతి సంవత్సరం దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యుత్ పంపిణీ సంస్థల ఆర్థిక నివేదికలను సేకరించి వాటిలో అంశాలను పరిశీలించి రేటింగ్ ఇస్తుంది. దీనిలో భాగంగా గత జనవరి నెలలో విద్యుత్ పంపిణి సంస్థల 14వ ఇంటిగ్రేటెడ్ రేటింగ్స్ మరియు ర్యాంకింగ్స్ విడుదల చేసింది. ఈ నివేదిక విద్యుత్ పంపిణీ సంస్థల యొక్క ఆర్థిక స్థిరత్వానికి సంబంధించిన సగటు ఖర్చుకు సగటు రాబడి మధ్య తేడా, వినియోగదారుల నుండి ఆదాయ సమీకరణకు పట్టే రోజులు, ఉత్పత్తి సరఫరా సంస్థల చెల్లింపులకు పట్టే రోజులు, అప్పుల ద్వారా సంపాదించిన ఆస్తులు (ఆస్తులు అప్పుల మధ్య నిష్పత్తి), వచ్చే ఆదాయంతో అప్పులను తీర్చే సామర్థ్యం వంటి అంశాలు, పనితీరుకు సంబంధించిన బిల్లింగ్ సామర్థ్యం, కలెక్షన్ సామర్థ్యం,పంపిణీ నష్టాలు, కార్పొరేట్ విధానాల వంటి అంశా లు, బాహ్య విధానాలకు సంబంధించిన ప్రభుత్వ సబ్సిడీల సేకర ణ, ప్రభుత్వ బకాయిలు, పెరిగే ఇంధన ఖర్చులకు అనుగుణంగా టారిఫ్ పెంచడం వంటి అంశాలు ఇలా మొత్తంగా 15 అంశాలను కొలమానంగా తీసుకొని అనుకూల మార్కులు అలాగే ఆడిట్ నివేదికను పంపడంలో ఆలస్యం, అకౌంట్స్ నిర్వహణ, టారిఫ్ నమోదులో ఆలస్యం , బ్యాంకులకు రుణాలు చెల్లించడంలో వైఫల్యం, ఖర్చులు మరియు ఆదాయానికి మధ్య భర్తీ కానీ లోటు, నియంత్రణ ఆస్తుల పెరుగుదల వంటి అంశాలలో ప్రతికూల మార్కులు కేటాయిస్తూ మొత్తంగా 100 మార్కులకు రేటింగ్ ఇస్తారు. ఇలా పంపిణీ సంస్థలకు వచ్చిన స్కోరును బట్టి ఎ+(100-85),ఎ(65-85),బి(50-65),బి-(35-50), సి(15-35), సి -(5-15),డి గ్రేడ్‌లను కేటాయిస్తారు. ఇలా డిస్కంల ఆర్థిక స్థితి, పనితీరు పరిశీలించి 42 ప్రభుత్వ, 12 ప్రైవేట్ పంపిణి సంస్థల అలాగే 11 పవర్ డిపార్ట్మెంట్ సంస్థల గ్రేడుల నివేదిక విడుదల చేసింది. 14వ సమీకృత శ్రేణుల నివే దిక ప్రకారం 31 విద్యుత్ పంపిణీ సంస్థలు ఎ+, ఎ గ్రేడ్ లను సాధిస్తే 11 సంస్థలు సి, సి-, గ్రేడులు సాధించాయి. 13వ నివేదికతో పోలిస్తే 18 విద్యుత్ పంపిణీ సంస్థలు, 4 పవర్ డిపార్ట్మెంట్‌లు తమ స్థాయిలను మెరుగు పర్చుకున్నాయి. 9 పంపిణీ సంస్థలు 1 పవర్ డిపార్ట్మెంట్ తమ స్థాయిలను తగ్గించు కున్నాయి. అలాగే గత సంవత్సరం రేటింగ్ ప్రకారం సీ, సి-గ్రేడులలో 18 సంస్థలు ఉంటే అది ప్రస్తుతానికి 10కి తగ్గింది. గత సంవత్సరంతో పోలిస్తే అగ్రిగేట్ టెక్నికల్ అండ్ కమర్షియల్ నష్టాలు 15.97 శాతం నుండి 15.04 శాతానికి తగ్గాయి. బిల్లింగ్ సామర్థ్యం 86.99 శాతం నుండి 87.59 శాతానికి పెరిగింది. అలాగే కలెక్షన్ సామర్థ్యం 96.60 శాతం నుండి 97.00 శాతానికి పెరిగింది. 17 సంస్థలు 100 శాతం కలెక్షన్ చేస్తే 29 సంస్థల కలెక్షన్ సామర్థ్యం క్రితం గణాంకాలతో పోలిస్తే పెంచుకున్నాయి. గత ఆర్థిక సంవత్సరం అన్ని పంపిణీ సంస్థల పన్నుల అనంతర లాభం కాస్త 27020 కోట్లు నష్టంగా ఉంటే ఈ ఆర్థిక సంవత్సరం దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా 2770 కోట్ల పన్ను అనం తర లాభాల్ని గడించాయి. ఇది విద్యుత్ రంగా చరిత్రలో చెప్పుకో దగ్గ మైలురాయని అని చెప్పాలి. ఒక యూనిట్ విద్యుత్ సగటు కొనుగోలు ధరకు(ఎసిఎస్) మరియు సగటు ఆదాయ అవస రాల(ఎఆర్ఆర్)ల మధ్య తేడా0.32/kwh నుండి 0.7/kwh కు తగ్గింది. ఇది గణనీయమైన తగ్గుదల అని చెప్పాలి. వివిధ పథకాల ద్వారా ప్రభుత్వాల నుండి పొందే సబ్సిడీలు శాతం 97.45 నుండి 98.90 శాతానికి పెరిగింది. మన తెలంగాణతో సహా 13 రాష్ట్రాల విద్యుత్ పంపిణీ సంస్థలకు 100 శాతం సబ్సిడీ పద్దులను చెల్లించాయి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు. వినియోగ దారుల నుండి కలెక్షన్ 113 రోజుల నుండి 112 రోజులకు అలాగే ఉత్పత్తి సరఫరా సంస్థలకు చెల్లించే పద్దులను 132 రోజులనుండి 113 రోజులకు తగ్గింది. ఇలా ఎ+ సాధించిన 12 పంపిణీ సంస్థల్లో ఆరు ప్రైవేట్ ఆరు ప్రభుత్వ డిస్కంలు ఉన్నాయి. దేశంలో విద్యుత్ పంపిణి చేసే ప్రైవేట్ డిస్కంలు అన్ని పన్ను అనంతర లాభాలను గడించాయి. అలాగే 44 ప్రభుత్వ విద్యుత్ పంపిణి సంస్థలో 22 సంస్థలు వార్షిక లాభాలను అర్జించాయి.

ఈ గణాంకాలు పరిశీలిస్తే అర్థం అవుతుంది ప్రభుత్వ డిస్కం లు కూడా రోజూరోజుకు తమ ఆర్థిక పరిస్థితిని మెరుగు పర్చు కుంటూ తమ పనితీరును మార్చుకుంటూ ప్రజలకు నాణ్యమైన నిరంతర విద్యుత్ను అందిస్తున్నాయి. ఇలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు వినియోగదారులు అందరు విద్యుత్ సంస్థలకు సహకరిస్తే ప్రస్తుతం ఉన్న ప్రైవేట్ పంపిణీ సంస్థలతో పాటు ప్రభుత్వ డిస్కంలు అన్ని ప్రగతి పథంలో నడుస్తాయి. కేంద్ర ప్రభుత్వం కూడా విద్యుత్ను ప్రైవేటీకరణ చేయకుండా ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించాలనే ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది.

**- భైరబోయిన వెంకటేశ్వర్లు**
తెలంగాణ రాష్ట్ర విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ల సంఘం

# సాయుధ యోధుడు మగ్దూం



హైదరాబాద్ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచమంతా గర్వించేలా, గౌరవించేలా తన గళంతోనూ, కలంతోనూ ప్రచారం చేసిన గొప్ప వ్యక్తి మగ్దూం మొహియుద్దీన్. భారత దేశంలో వచ్చిన ప్రగతి శీల రచయితల ఉద్య మానికి హైదరాబాద్లో జీవం పోసింది మఖ్దుమే. నాలుగు దశాబ్దాలకు పైగా కమ్యూనిస్టు ఉద్య మాలకు, సాహిత్య సృజనకు తన జీవితాన్ని అంకి తమిచ్చాడు. మొక్కవోని ధైర్యంతో కులమతాల కతీతంగా పేదల పక్షాన నిలిచి వారి అభ్యున్నతికి ఆయన కృషి చేశాడు.

మగ్దూం మొహియుద్దీన్ ప్రముఖ అధ్యాపకుడు, ఉర్దూ కవి. 'షాయరే ఇంక్విలాబ్' (ఉద్యమ కవి, విప్లవ రచయిత) బిరుదాంకితుడు. కవి, నాటక కర్త, గాయకుడు, నటుడు కూడా. ఇతని గజల్ లు, పాఠ్యాంశాలలోను, సినిమాల లోనూ ఉపయో గించాడు. ఆయన రాసిన 'ఏ జంగ్ హై జంగే ఆజాదీ' 'ఎక్ చంబేలీకె మండ్వే తలే' అనే గీతాలు ప్రసిద్ధి పొందాయి. ఉర్దూ మహా కవిగా ప్రపంచాన్ని ఉర్రూతలూగించాడు.

మగ్దూం మొహియుద్దీన్ తెలంగాణ లోని మెదక్ జిల్లా ఆందోల్‌లో 1908, ఫిబ్రవరి 4న జన్మిం చాడు. ఆయన పూర్తిపేరు అబూ సయీద్ మహ్మద్ మఖ్దూమ్ మొహియొద్దీన్ ఖాద్రి. అయన పూర్వీకులు ఉత్తరప్రదేశ్‌లోని ఆజంగఢ్‌లో ఉండే వారు. ఆయన తాత (తల్లితండ్రి) రషీదుద్దీన్ ఔరంగజేబు సైన్యాలతో పాటు దక్కన్ పీఠభూమికి వచ్చాడు. అలాగే, మరో తాత (తంపూడికి తండ్రి) సయ్యద్ జాఫర్ అలీ కూడా ఉత్తర ప్రదేశ్ షాజహానాబాద్ నుండి 1857లోనే దక్షిణానికి వచ్చాడు.ఆ కుంటుంబ మంతా హైద్రాబాద్ దక్కన్ పరిసరాలకు చేరింది. ఆయన తండ్రి గౌస్ మొహి యొద్దీన్ నిజాము ప్రభుత్వంలో సూపరింటెండెం టుగా పని చేసేవాడు. ఆయన రాసిన 'గోథే ప్రేమ లేఖలు' 'మక్తబా' అనే స్థానిక ఉర్దూ పత్రిక అచ్చు వేసింది.

నాగపూర్ కామ్రేడ్‌ల సహాయంతో 1930-40 లలో హైద్రాబాద్‌లో 'స్టూడెంట్స్ యూనియన్' ప్రారంభించాడు. 1940లో తన సహచరులతో కలిసి కమ్యూనిస్టుపార్టీలో చేరాడు. చంద్ర రాజేశ్వర రావు, గులాంహైదర్, రాజ బహదూర్ గౌర్, హమీదలీ ఖాద్రీలాంటి నాయకులతో కలిసి పని చేస్తుండేవాడు. అక్తర్ హుస్సేన్ రాయ్‌పురి, సిబ్తె హసన్‌లతో కలిసి హైద్రాబాద్‌లో 'అభ్యుదయ రచయితల సంఘం' స్థాపించాడు. సరోజినీ నాయుడు నివాసమైన గోల్డెన్ త్రెషోల్డ్‌లో డాక్టర్ జయసూర్య, జె.వి.నరసింగరావులతో కలిసి సాహిత్య, సామాజిక, రాజకీయ అంశాలపై చర్చలు జరుపుతుండే వాడు. చార్మినార్ సిగట్ ఫ్యాక్టరీ, బట్టలగిర్నీ,అల్విన్,షాబాద్ సిమెంట్, ఎన్ ఎస్సార్ రైల్వే ఎంప్లాయిస్,ఎలక్ట్రిసిటీ,సి.డబ్ల్యు.డి. మున్సి పాలిటీ, బటన్ ఫ్యాక్టరీ వంటి వందల కంపెనీల్లోని కార్మిక సంఘాలకు మఖ్దూమ్ అధ్యక్షుడయ్యాడు. నల్లగొండ జిల్లా హుజూర్ నగర్ నుండి శాసన సభకు ఎన్నికయ్యాడు. 1957లో మెదక్ నుండి పార్లమెంట్‌కు పోటీ చేసి ఓడి పోయాడు. శాసన మండలికి ఎన్నికై 1969లో కన్నుమూసే దాకా కమ్యూనిస్టు నేతగా ఆ పదవిలో కొనసాగాడు. మఖ్దూం ఫాసిజానికి వ్యతిరేకంగా సమసమాజ స్థాపనకోసం క్రియాశీలంగా రాజకీయాల్లో పాల్గొ న్నాడు. ప్రగతిశీల భావాలతో పీడితుల పక్షాన కలమెత్తి నమ్మిన సిద్ధాంతానికి జీవితాన్నంకితం చేశాడు. మఖ్దూం మతాన్ని దూషించ లేదు, అనుసరించ లేదు. హైద్రాబాద్ రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ శాఖకు తొలి కార్యదర్శి. నిజాంకు వ్యతిరేకం గా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ముఖ్య పాత్రధారి. సాయుధ పోరాటానికి ముందు కారా గార శిక్షలు, పోరాటం తర్వాత అజ్ఞాత వాసం. ఎఐటియుసికి జాయింట్ సెక్రటరీ. ఢిల్లీలో ఆల్ ఇండియాట్రేడ్ యూనియన్ సమాఖ్య (ఎ.ఐ.టి.యు.సి.) జాయింట్ సెక్రటరీగా ఉన్నాడు. 1952-55 మధ్య చైనా, సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ దేశాలు, ఆఫ్రికన్ దేశాలు తిరిగి వచ్చాడు. ప్రపంచ ట్రేడ్ యూనియన్ సమాఖ్య ప్రధాన కార్యాలయం వియాన్నాలో (1953-54) పనిచేశాడు.

1969, ఆగష్టు 25 తేదీన గుండె పోటుతో ఢిల్లీలో చనిపోయాడు. ఆయన పేరిట హైద్రాబాద్, హిమాయత్ నగర్‌లో సి.పి.ఐ. రాష్ట్ర కార్యాలయం మఖ్దూమ్ భవన్ నిర్మించారు.

**ఫిబ్రవరి 4...మగ్దూం మొహియుద్దీన్ జయంతి**
**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# రికార్డు స్థాయిలో రక్షణ బడ్జెట్





భారత్‌కు ఓ వైపు పాక్, మరో వైపు చైనా, బంగ్లాదేశ్ నుంచి పెరుగు తున్న భద్రత సవాళ్ల నేప థ్యంలో కేంద్ర ప్రభుత్వం రికార్డు స్థాయిలో రక్షణ బడ్జెట్‌ను పెంచింది. ఆపరేషన్ సిందూర్‌తో అత్యాధునిక యుద్ధతంత్రం అవసరాలను గుర్తిం చిన భారత్ అందుకు తగ్గట్లు కేటాయింపులను చేసింది. గతేడాది రక్షణ రంగానికి రూ.6.81లక్షల కోట్లు కేటాయించగా ఈసారి రూ.7.85 లక్షల కోట్లు కేటాయించింది.

ముఖ్యంగా రక్షణ దళాల ఆధునికీకరణకు ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేసి దాదాపు 22 శాతం కేటాయింపులను పెంచింది. దేశ త్రివిధ దళాలను ప్రపంచంలోనే అత్యంత ఆధునికంగా, స్వదేశీ ఆయుధాలతో సన్నద్ధం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ఉంది. అందుకే ఈ ఏడాది బడ్జెట్లో సైనిక ఆధునికీకరణకురూ. 2.19 లక్షల కోట్లను కేటాయించారు. గతేడాది రఫేల్ యుద్ధ విమానాలు, జలాంతర్గాములు, మానవరహిత వైమానిక వాహ నాల కోసం రక్షణ శాఖ ఒప్పందాలు చేసుకుంది. ఈ క్రమంలో తాజా బడ్జెట్ కేటాయింపులు రక్షణ శాఖకు మరింత ఊతమివ్వ నున్నాయి.

రక్షణ రంగానికి కేటాయించిన మొత్తం మూలధన వ్యయాన్ని రూ.2,19,306 కోట్లుగా నిర్మలా సీతారామన్ నిర్ణయించారు. రెవెన్యూ వ్యయాన్ని రూ.5,53,668 కోట్లుగా ఉంచారు. ఇందులో రక్షణ రంగానికి చెందిన ఉద్యోగుల పింఛన్ల కోసం రూ.1,71,338 కోట్లు కేటాయించారు. మూలధన వ్యయం కింద విమానాలు, ఏరో ఇంజిన్ల కోసం రూ.63,733 కోట్లు, నౌకాదళం కోసం రూ.25, 023 కోట్లు కేటాయించారు.

శిక్షణ, ఇతర విమా నాల తయారీకి అవసరమైన విడిభాగాలు, భాగా లపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని మినహాయిం చాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. రక్షణ రంగంలోని విమానాల విడిభాగాల తయారీకి దిగుమతి చేసుకునే ముడి పదార్థాలపై బేసిక్ కస్టమ్స్ సుంకాన్ని కూడా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ ఈ మేరకు వ్యాఖ్యా నించారు. మంత్రి తీసుకున్న ఈ రెండు నిర్ణయాలు డిఫెన్స్ ఏరోస్పేస్ పరిశ్రమకు మరింత ఊతమి స్తాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ముఖ్యంగా రక్షణ దళాల ఆధునికీకరణకు ఈ బడ్జెట్లో పెద్దపీట వేశారు. 21.84 శాతం కేటాయింపులను పెంచారు. గతేడాది కేవలం 1.8లక్షల కోట్లనే కేటాయించగా, ఈసారి దానిని రూ. 2.19 లక్షల కోట్లకు పెంచారు. గత మూడేళ్లతో పోలిస్తే అత్యధికంగా రూ.255 కోట్లు ఇచ్చారు. గతేడాది రూ.222 కోట్లు మాత్రమే కేటాయించారు. రక్షణ రంగంలో రహస్యమైనవిగా భావించే స్పెషల్ ప్రాజెక్టులకు కూడా రూ.1989.12 కోట్లను ఇచ్చారు.

ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం నేవీ, ఎయిర్‌ఫోర్స్ సామర్థ్యాలను బలోపేతం చేయడానికి, స్వదేశీ ఆయుధాల తయారీని వేగవంతం చేయడానికి శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో రక్షణ రంగానికి భారీగా బడ్జెట్ను కేటాయించింది. 2025-2026 ఆర్థిక సంవత్సరం కన్నా రూ.లక్ష కోట్లకు పైగా అదనపు మొత్తాన్ని రక్షణ రంగానికి ఇచ్చింది. అంటే గతేడాది కన్నా ఈ ఏడాది రక్షణ రంగానికి 15 శాతం నిధులను అదనంగా కేటాయించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర సర్కార్ రక్షణ రంగానికి రూ.6,81,210 కోట్లు కేటా యించింది.

మూలధన వ్యయాన్ని రూ.1,80,000 కోట్లుగా నిర్ణయించింది. సవరించిన అంచనాల దశలో అది రూ.1,86,454 కోట్లకు పెరిగింది. అయితే ఈ ఏడాది రక్షణ బడ్జెట్‌ను ఏకంగా రూ.7.84 లక్షల కోట్లుకు పెంచింది. గత ఏడాది మేలో భారత్, పాకిస్తాన్ మధ్య ఘర్షణ తలెత్తిన నేపథ్యంలో రక్షణ బడ్జెట్ 15 శాతం పెరిగింది. పహల్గామ్ కాల్పుల తరువాత పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకున్నట్టు భారత్ ప్రకటించింది.

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి, వచ్చే ఏడాది అమలులోకి రానున్న పే-కమిషన్ సిఫార్సులను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను కొనసాగించే అవకాశం ఉంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటును జీడీపీలో 4.2 నుంచి 4.4 శాతం పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు యూబీఐ పేర్కొంది.

అంతేకాకుండా, 2031 నాటికి రుణ-జీడీపీ నిష్పత్తిని 50 శాతానికి తగ్గించాలనే దీర్ఘకాలిక ప్రణాళికతో కేంద్రం అడుగులు వేస్తోంది.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం తన వ్యయాన్ని కొనసాగించనుంది. జీడీపీలో దాదాపు 3.2 శాతానికి సమానమైన రూ. 12.4 లక్షల కోట్లను మూలధన వ్యయం కింద కేటాయించవచ్చు.

ఇందులో రక్షణ రంగం, జాతీయ రహదారుల నిర్మాణం , రైల్వే వ్యవస్థ ఆధునీకరణకు అత్యధిక ప్రాధాన్యత లభించనుంది. జీఎస్టీ పరిహారం సెస్ నిలిపివేత వంటి ఆదాయ పరమైన సవాళ్లు ఉన్నప్పటికీ, అభివృద్ధి పనులకు నిధుల కొరత లేకుండా ప్రభుత్వం జాగ్రత్త పడుతోంది.

**- ఇస్కా రాజేష్ బాబు**
93973 99298

# మీ వేలు ఎవరిని ఎన్నుకోబోతోంది?



వేలిపై సిరా చుక్క పడబోతోంది.. ఐదేళ్ల భవిష్యత్తును శాసించ బోతోంది. ఆ చిన్న గుర్తు కేవలం ఓటు కు సాక్ష్యం మాత్రమే కాదు, మీ వీధి వెలుగుకు, మీ పట్టణ ప్రగతికి అది ఒక బలమైన హామీ. మురికి కాల్వల నిర్వహణ నుంచి మున్సిపల్ కార్యాలయాల పారదర్శకత వరకు మన నిత్యజీవితాన్ని ప్రభావితం చేసే క్షేత్రస్థాయి సమరానికి తెలంగాణ వేదికైంది. ఈ ఎన్నికలు కేవలం అధికారం కోసం జరిగే పోటీ కాదు ప్రజాస్వామ్య ఫలాలను నేరుగా ప్రజల ముంగిటకు చేర్చే ఒక మహత్తర అవకాశం. మీ వార్డు ప్రగతి రథసారధి ఎవరో నిర్ణయించే సమయం వచ్చేసింది.

భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో పురపాలక ఎన్నికలు క్షేత్ర స్థాయి పాలనకు అసలైన పునాదులుగా నిలుస్తాయి. పట్టణ ప్రజల నిత్యజీవితాన్ని ప్రభావితం చేసే తాగునీరు, పారి శుధ్యం, రహదారులు, వీధి దీపాలతో పాటు పర్యావరణ పరి రక్షణ వంటి ప్రాథమిక సేవలన్నీ పురపాలక వ్యవస్థ ద్వారానే అమలవుతాయి. అందుకే ఈ ఎన్నికల్లో పౌరుల చురుకైన భాగస్వామ్యం ప్రజాస్వామ్య ఆరోగ్యానికి అత్యంత ఆవశ్యకం.

రాష్ట్ర ఎన్నికల యంత్రాంగం విడుదల చేసిన సమాచారం ప్రకారం, తెలంగాణలో 116 మునిసిపాలిటీలు, 7 నగర పాలక సంస్థలు ఈ ఎన్నికల్లో భాగస్వామ్యమవుతున్నాయి. మొత్తం 2,996 వార్డుల్లో సుమారు 52,43,023 మంది ఓటర్లు తమ హక్కును వినియోగించుకునేందుకు సిద్ధమ య్యారు. వీరిలో 26,80,014 మంది మహిళా ఓటర్లు, 25, 62,639 మంది పురుష ఓటర్లతో పాటు 640 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. ఈ విస్తృత పౌర భాగస్వామ్యం పట్టణ పాలనలో సంభవించ బోయే సానుకూల మార్పులకు స్పష్టమైన సూచిక.

ఈసారి పురపాలక ఎన్నికలు బహుముఖ పోటీతో రసవత్త రంగా సాగుతున్నాయి. రాజకీయ వర్గాల సమాచారం



ప్రకారం, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు అభ్యర్థులను బరిలోకి దింపాయి.ఎంఐఎం, తెలంగాణ జన సమితి, బాహు జన్ సమాజ్ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ కొన్ని నగర ప్రాంతాల్లో తమ ప్రభావాన్ని కొనసాగిస్తాయి. అదనంగా, ఇతర చిన్న పార్టీలతో పాటు వేల సంఖ్యలో స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉండటం తో ప్రతి వార్డులో సగటున 6 నుంచి 8 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు అంచనా. ఇది ఎన్నికలను మరింత ఉత్కంఠ భరితంగా మారుస్తోంది. ఎన్నికల నిర్వహణ షెడ్యూల్ అధికారిక ప్రకటనల ప్రకారం, పురపాలక పోలింగ్ ఫిబ్రవరి 11, 2026న ఒకే విడతలో నిర్వహించనున్నారు. సాంకేతిక కారణాలతో ఎక్కడైనా అంతరాయం కలిగితే ఫిబ్రవరి 12న తిరిగి పోలింగ్ నిర్వహించే వెసులుబాటు ఉంది. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించగా, ఫిబ్రవరి 16న మేయర్లు లేదా చైర్మన్‌ల ఎంపికతో ఈ ప్రక్రియ ముగుస్తుంది.

భారత రాజ్యాంగంలోని తొమ్మిదవ భాగం, పన్నెండవ షెడ్యూల్లో పేర్కొన్న 18 విధులు నేరుగా ప్రజల ప్రాథమిక అవసరాలతో ముడిపడి ఉన్నాయి. స్థానిక స్వపరిపాలన అనేది కేవలం అధికార వికేంద్రీకరణ మాత్రమే కాదు, అది పౌరుడికి అప్పగించినసామాజిక బాధ్యత. ప్రలోభాలకు లోనుకాకుండా, స్వేచ్ఛాయుతంగా, విచక్షణతో ఓటు వేయడం ప్రతి పౌరుడి నైతిక కర్తవ్యం. కుల మతాలకు అతీతంగా అభివృద్ధినే ప్రమాణంగా తీసుకుని ఓటు వేయడమే పరిపక్వ ప్రజాస్వామ్య లక్షణం.పట్టణ భవిష్యత్తుకు బాట పురపాలక ఎన్నికలు కేవలం తాత్కాలిక నినాదాల పోటీ కాదు ఇవి మన నగరాల భవిష్యత్తును నిర్ణయించే కీలక మలుపులు. వేలిపై పడే సిరా చుక్క బాధ్యతకు చిహ్నమైతే, ఆ వేలు ఎన్నుకున్న నాయకత్వమే పట్టణ వికాసానికి ప్రాణం. ఎన్నికలతో ప్రజాస్వామ్యం ముగియదు, అక్కడే బాధ్యతాయుత పాలన మొదలవుతుంది. మీ వీధి వెలగాలంటే, మీ పట్టణం గెలవా లంటే ఫిబ్రవరి 11న మీ ఓటు హక్కును చట్టబద్ధంగా, విచక్షణతో వినియోగించుకోవడమే నిజమైన పౌర ధర్మం. వివేకంతో ఓటు వేద్దాం.. వికాసానికి దారి చూపుదాం.

**- ఫిరోజ్ ఖాన్**
9640466464

# తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను కాపాడటం ప్రభుత్వ కర్తవ్యం

- శ్రీవారి ప్రసాదం నెయ్యి కల్తీని తీవ్రంగా పరిగణిస్తూ దోషులపై కఠిన చర్యలు
- స్వల్పకాలిక పరిపాలనా కమిటీని ఏర్పాటు చేసి ఈ అంశాన్ని సమగ్రంగా సమీక్షిస్తాం
- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



**అమరావతి, ఫిబ్రవరి 3(మనంప్రతినిధి):** కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు కొలువైవున్న తిరుమల తిరుపతి దేస్థానం పవిత్రతను కాపాడటం ప్రభుత్వం ప్రథమ కర్తవ్యం అని, శ్రీవారి ప్రసాదం నెయ్యి కల్తీని తీవ్రంగా పరిగణిస్తూ దోషులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఈ అంశాన్ని సమగ్రంగా సమీక్షించి సత్వరమే తుది నివేదికను ప్రభుత్వానికిని సమర్పించేందుకు స్వల్పకాలిక పరిపాలనా కమిటీని ప్రభుత్వం నియమిస్తున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారధి, నాదెండ్ల మనోహర్ మరియు సత్యకుమార్ యాదవ్ తో కలిసి మంత్రి పయ్యావుల కేశవ్ పాత్రికేయులతో మాట్లాడుతూ నేడు జరిగిన క్యాబినెట్ సమావేశంలో అజండా అంశాలను ప్రక్కనబెట్టి మరీ తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) లడ్డు ప్రసాదంలో ఉపయోగించిన నెయ్యిలో జరిగిన కల్తీలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (శిఐశీ) సమర్పించిన నివేదికను సమగ్రంగా పరిశీలించడం జరిగిందన్నారు. ఈ నివేదిక, భారత సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సిబిఐ పర్యవేక్షణలో ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం ద్వారా సమర్పించబడినదన్నారు. సిట్ నుండి ప్రభుత్వానికి రెండు పత్రాలు అందాయని, వాటిలో ఒకటి ఇప్పటికే కోర్టులో దాఖలు చేయబడిన చార్జ్ షీట్, మరొకటి ప్రభుత్వానికి ప్రత్యేకంగా పంపిన 11 పేజీల గోప్య నివేదిక అని తెలిపారు. కోర్టు చార్జ్ షీట్ను అధికారికంగా కాగ్నిజెన్సు లోకి తీసుకున్న తర్వాతనే అది ప్రభుత్వానికి మరియు సంబంధిత కక్షిదారులకు అందుబాటులోకి రానుందన్నారు. క్యాబినెట్ ముందు ఈ నివేదికను ఉంచి, అందులో పేర్కొన్న ప్రధాన అంశాలు మరియు తేలిన లోపాలపై విస్తృత స్థాయిలో చర్చ జరిగిందన్నారు. ప్రభుత్వానికి అందిన నివేదిక ప్రకారం, నెయ్యి సరఫరా, టెండర్ నిబంధనల సడలింపు, నాణ్యత లోపాలు మరియు తప్పుడు పత్రాల సమర్పణ వంటి తీవ్రమైన అవకతవకలు చోటుచేసుకున్నట్లు తేలిందన్నారు. సిట్ నివేదిక ప్రకారం, 2019 తర్వాత టిటిడి నెయ్యి కొనుగోలు విధానంలో అనవసరమైన సడలింపులు చేయడం ద్వారా నాణ్యతకు విరుద్ధమైన సరఫరాలు జరగడానికి అవకాశం కల్పించబడిందన్నారు. టెండర్ నిబంధనల్లో రూ.250 కోట్ల టర్నోవర్ షరతును రూ.150 కోట్లకు తగ్గించడం, కనీస పాల ప్రొక్యూర్మెంట్ అనుభవం లేకున్నా అర్హత కల్పించడం వంటి చర్యలు ఉద్దేశపూర్వకంగా చేపట్టబడ్డాయని నివేదిక స్పష్టం చేసిందన్నారు. తిరుమల నెయ్యి కల్తీపై క్యాబినెట్ లో సుదీర్ఘ చర్చ.మంత్రి కొలుసు పార్థసారధి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి అధ్యక్షతన నేడు జరిగిన క్యాబినెట్ సమావేశంలో, ముందుగా నిర్ణయించబడిన అజెండా అంశాలన్నింటినీ పక్కన పెట్టి, కోట్లాది మంది హిందువుల మనోభావాలను గౌరవిస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన అంశంపై సుదీర్ఘ చర్చ జరిగిందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. కలియుగ ప్రత్యక్ష దైవంగా భావించే శ్రీ వెంకటేశ్వర స్వామివారి సన్నిధిలో చోటుచేసుకున్న నెయ్యి కల్తీ ఘటనపై సిబిఐ సమర్పించిన నివేదికను ముఖ్యమంత్రి గారు సమావేశంలో ఉంచి, దాని పై సుమారు మూడు గంటలపాటు చర్చ నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామివారి పవిత్రతను కాపాడటం, హిందూ భక్తుల విశ్వాసాన్ని రక్షించటం ప్రభుత్వ ధర్మమని ముఖ్యమంత్రి గారు స్పష్టం చేశారన్నారు. సిబిఐ నివేదికలో పేర్కొన్న అంశాలపై ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చ జరగగా, గౌరవ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారుతో సహా మంత్రులు అందరూ తమ తమ అభిప్రాయాలను వివరించారన్నారు. తిరుమల పవిత్రతను కాపాడేందుకు మరియు దోషులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని క్యాబినెట్ ఏకగ్రీవంగా అంగీకరించిందని మంత్రి

రాజకీయ కోణంలో వక్రీకరించే ప్రయత్నాలను నిరసిస్తున్నాం.మంత్రి నాదెండ్ల మనోహర్ తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతకు భంగం కలిగించిన నెయ్యి కల్తీ వ్యవహారంపై విస్తృత చర్చ నేటి క్యాబినెట్ సమావేశంలో జరిగిందని రాష్ట్ర పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గౌరవ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారితో సహా మంత్రులందరూ భక్తుల మనోభావాలను కాపాడే దిశగా స్పష్టమైన అభిప్రాయాలను వ్యక్తం చేశారన్నారు. ఈ అంశాన్ని రాజకీయ కోణంలో వక్రీకరించే ప్రయత్నాలను నిరసిస్తూ, ప్రజలకు వాస్తవాలను పారదర్శకంగా తెలియజేయాలనే నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. సమావేశానికి గౌరవ అడ్వకేట్ జనరల్ గారిని ఆహ్వానించి చట్టపరమైన సలహాలు పొందడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి గారు భక్తుల విశ్వాసం దెబ్బతినకుండా ఉండేందుకు ప్రభుత్వం నిజాయితీగా వ్యవహరించాలనే దృఢసంకల్పాన్ని వ్యక్తం చేశారన్నారు. గత ప్రభుత్వ కాలంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అంశాలను బయటపెట్టి, ప్రస్తుతం ప్రభుత్వం నెయ్యి నాణ్యతపై పలు మార్లు ల్యాబ్ టెస్టులు నిర్వహిస్తూ పారదర్శకతతో చర్యలు తీసుకుంటోందని వివరించారు. భవిష్యత్తులో ఎవరు తప్పు చేసినా వారిపై కఠిన చర్యలు తప్పవని, శ్రీవారి పవిత్రతను కాపాడటమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని క్యాబినెట్ ఏకాభిప్రాయంగా నిర్ణయించిందని ఆయన తెలిపారు. సృష్టికి విరుద్ధంగా పాలు లేకుండా నెయ్యిని తయారు చేశారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ తిరుమల తిరుపతి దేవస్థానం కల్తీ నెయ్యి విషయంలో భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా గత ప్రభుత్వ పాలకులు వ్యవహరించారని, రూ.250 కోట్ల అవినీతి కుంభకోణంతో పాటు పవిత్రతను నాశనం చేసినట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. గత ప్రభుత్వ కాలంలో 2022లో సిఎఫ్టిఆర్ఐ ఇచ్చిన హెచ్చరికలను దాచిపెట్టి, టెండర్ నిబంధనల్లో ఉద్దేశపూర్వక సడలింపులు చేసి తెలియని సంస్థలకు అనుకూలం కల్పించారన్నారు. సృష్టికి విరుద్ధంగా అసలు పాలే లేకుండా రసాయనాలను ఉపయోగించి తయారు చేసిన నెయ్యిని ఉపయోగించడం ద్వారా భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీయడం జరిగిందన్నారు. అదేవిధంగా ఆలయ పవిత్రతను దెబ్బతీసిన చర్యలు, అన్యమత ప్రచారం, డిక్లరేషన్ నిబంధనల ఉల్లంఘన, బ్రహ్మోత్సవాల సంప్రదాయాల పట్ల నిర్లక్ష్యం వంటి అంశాలు గత పాలనలో చోటుచేసుకున్నాయన్నారు. ప్రస్తుతం సిబిఐ ఇచ్చిన 11 పేజీల నివేదికపై విస్తృత చర్చ జరగగా, ఎవరు ఎంత పెద్ద స్థాయిలో ఉన్నా దోషులను ఉపేక్షించకూడదని క్యాబినెట్ ఏకగ్రీవంగా నిర్ణయంతీసుకోవడం జరిగిందని మంత్రి తెలిపారు.

## చిన్న, మధ్యతరహా వ్యాపారాల కోసం భారత్లో తొలి వాయిస్-ఆధారిత బిల్లింగ్

- ఏఐ ఏజెంట్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా 'పిల్లో ఏఐ' ఆవిష్కరణ
- వాయిస్ కమాండ్ ద్వారా మొదటి ఇన్వాయిస్ను రూపొందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**విశాఖపట్నం, ఫిబ్రవరి 3 ( మనం న్యూస్)** ఆంధ్రప్రదేశ్ గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, చిన్న మరియు మధ్యతరహా వ్యాపార యజమానులకు శక్తినిచ్చే తదుపరి తరం వాయిస్-ఆధారిత బిల్లింగ్ మరియు అకౌంటింగ్ ఏఐ ఏజెంట్ పిల్లో ఏఐ ను ఈ రోజు అధికారికంగా ప్రారంభించారు. ఈ చారిత్రక ఆవిష్కరణ, స్థానిక వ్యాపారులు మరియు చిన్న మరియు మధ్య తరహా వ్యాపారాలకు అత్యాధునిక కృత్రిమ మేధస్సు పరిష్కారాలను చేరువ చేసే దిశగా ఒక కీలక ముందడుగుగా నిలుస్తుంది. ఈ ఆవిష్కరణ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి సిఎస్ విజయానంద్ (ఐఅశీ), మాజీ మంత్రి మరియు ఎమ్మెల్యే ప్రతిపాటి పుల్లారావు, ముత్తవరపు సురేష్, రామ్ మోహన్, పిల్లో ఏఐ సహ-వ్యవస్థాపకుడు, అలాగే పిల్లో ఏఐ పెట్టుబడిదారులు హాజరయ్యారు. పిల్లో ఏఐ ద్వారా వ్యాపార యజమానులు తమ స్వంత మాతృభాషలో మాట్లాడటం ద్వారా బిల్లులు తయారు చేయడం, లావాదేవీలు నమోదు చేయడం, నివేదికలు పొందడం మరియు ఖాతాలను నిర్వహించడం చేయగలరు. అకౌంటింగ్ ప్రత్యేక పరిజ్ఞానం లేకుండా లేదా క్లిష్టమైన సాఫ్ట్వేర్ అవసరం లేకుండా రూపొందించబడిన ఈ యాప్, సమయం ఆదా చేయడంతో పాటు శ్రమను తగ్గించేందుకు ఉద్దేశించబడింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ,పిల్లో ఏఐ రోజువారీ వ్యాపార ప్రక్రియలను సులభతరం చేయడంలో సాంకేతికత ఎలా ఉపయోగపడుతుందో చూపించే ఉత్తమ ఉదాహరణ. ఇలాంటి సాధనాలు చిన్న వ్యాపారాలు మరియు తమ ఆర్థిక వ్యవహారాలను సులభంగా నిర్వహించేందుకు, పారదర్శకతను పెంచేందుకు మరియు డిజిటల్ వృద్ధి, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్పై ఆంధ్రప్రదేశ్ దృష్టిని బలపరచేందుకు తోడ్పడతాయి, అని అన్నారు. కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి గారు స్వయంగా పిల్లో ఏఐ లో మొదటి ఇన్వాయిస్ను వాయిస్ కమాండ్ ద్వారా రూపొందించి, సహజ భాషలో సంభాషణలు ఎలా తక్షణమే వాస్తవ వ్యాపార చర్యలుగా మారుతాయో ప్రదర్శించారు.

## ప్రజల ప్రాణాలే ప్రథమం ఆచంటలో దోమలపై నిరంతర పోరాటం

- పంచాయతీ అభివృద్ధి అధికారి జీవీఎస్ఎల్ నరసింహారావు



**ఆచంట ఫిబ్రవరి 3 మనం న్యూస్ :** ఆచంట గ్రామపంచాయతీ పరిధిలోని చిన్నపేట, పెద్దపేట ప్రాంతాల్లో దోమల బెడదను నియంత్రించేందుకు పంచాయతీ అభివృద్ధి అధికారి జి.వి.ఎస్.ఎల్. నరసింహారావు (నాగబాబు) ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు విస్తృత స్థాయిలో దోమల మందు పిచికారీ చేపడుతున్నారు. డ్రైన్లు, నిల్వ నీరు ఉన్న ప్రాంతాలు, ఇళ్ల పరిసరాల్లో ఏబ్బాట్ మందును మలాథిన్తో కలిపి వినియోగిస్తూ దోమల ఉత్పత్తి మూలాలనే లక్ష్యంగా చేసుకుని ఈ కార్యక్రమం కొనసాగుతోంది.దోమల కాటు - ప్రాణాంతక వ్యాధులకు ద్వారం దోమలు కుడితే డెంగీ, మలేరియా, చికెన్గున్యా, ఫైలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని పంచాయతీ అభివృద్ధి అధికారి జి.వి.ఎస్.ఎల్. నరసింహారావు తెలిపారు.అటువంటి వ్యాధుల బారిన ప్రజలు పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగానే దోమల మందు పిచికారీ చేపడుతున్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే గ్రామపంచాయతీ బాధ్యత అని, నిర్లక్ష్యానికి ఎలాంటి అవకాశం ఇవ్వబోమని ఆయన పేర్కొన్నారు. చేతల్లో పని కనిపిస్తేనే పాలన - ప్రజారోగ్యంపై స్పష్టమైన వైఖరి గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, దోమల నివారణ విషయంలో కేవలం హెచ్చరికలు కాదు, క్షేత్రస్థాయిలో పని చేసి చూపించడమే పరిపాలన అనే విధానాన్ని ఆచంట గ్రామపంచాయతీ అనుసరిస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని తన బాధ్యతగా భావిస్తూ, పంచాయతీ కార్మికులను సమన్వయపరచి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్న పీడీఓ నరసింహారావు (నాగబాబు) చర్యలు గ్రామంలో ఆరోగ్య భద్రతకు భరోసాగా మారుతున్నాయని గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు.



## మార్చి 14న జాతీయ లోక్ అదాలత్

- న్యాయమూర్తి ఎ. వాసంతి

**నరసాపురం, ఫిబ్రవరి 3 (మనం న్యూస్):** రానున్న మార్చి 14వ తేదీన నరసాపురం పట్టణంలోని అన్ని కోర్టు సముదాయాలలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు నరసాపురం 10వ అధనపు జిల్లా జడ్జి, చైర్ పర్సన్ ఎ . వాసంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్ లో ఆయా కోర్టుల పరిధిలో ఉన్న రాజీపడతగిన అన్ని సివిల్, క్రిమినల్ కేసులు, కుటుంబ తగాదాలు, భూ తగాదాలు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద నష్ట పరిహార కేసులు రాజీ చేసుకోవచ్చని ప్రతి రోజు కోర్టు సముదాయంలో జరుగుచున్న మధ్యవర్తిత్వం ద్వారా కూడా కక్షిదారులు తమ కేసులు రాజీ చేసుకొనే వెసులుబాటు ఉందని ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకొనుటకు వారి వారి న్యాయవాదుల ద్వారా గాని సంభదిత పోలీసులను లేదా కోర్టు ప్రాంగణంలో ఉన్న న్యాయ సేవాధికార సంస్థను గానీ సంప్రదించాలని న్యాయమూర్తి తెలిపారు. బ్యాంక్, బి.ఎస్.ఎన్.ఎల్ కు సంభందించిన లావాదేవీలు ప్రి లిటిగేషన్ కేసుల క్రింద సెటిల్ చేసుకో వచ్చని వర్చువల్ గా కూడా కేసులు రాజీ చేసుకొనే వెసులుబాటును ఉన్నత న్యాయస్థానాలు కల్పించినట్లు న్యాయమూర్తి వాసంతి తెలిపారు.



## ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

**నరసాపురం, ఫిబ్రవరి 3 (మనం న్యూస్):** ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్ల పిలుపులో భాగంగా ఫిబ్రవరి 12న జరుగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆశా వర్కర్లు అందరూ పాల్గొనాలని సీఐటీయూ జిల్లా ఉపా ధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ కోరారు. మంగళ వారం నరసాపురం మండలం ఎల్ బి చర్ల పీహెచ్సీ వద్ద ఆశ వర్కర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సత్య నారాయణ మాట్లాడుతూ కార్మికులను యజమానులకు కట్టు బానిసలుగా మార్చే ఉర్కోడ్స్ రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ రంగసంస్థలను పరిరక్షించాలని ఆశాలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని చట్టబద్ధమైన సౌకర్యాలు, సంక్షేమ పథకాలు అమలు చెయ్యాలన్నారు. గత 20 సంవత్సరాలుగా పేద ప్రజలకు ఆరోగ్యసేవలు అందిస్తున్నారని ప్రభుత్వం వీరి సేవలను గుర్తించి కార్మికులుగా గుర్తించాలని, ఇతర సౌకర్యాలను కల్పించాలని, నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలని, ఏజెన్సీలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని, సమాన వేతనం, సౌకర్యాలు కల్పించాలని సత్యనారాయణ డిమాండ్ చేశారు. అనంతరం డాక్టర్ ఎం. మాధురికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పులపర్తి రత్నకుమారి, షేక్ నసీమా బేగం, మేకా విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## మంచు కొండలా కరుగుతున్న గుండాల ఇసుక గుట్టలు

- అక్రమ ఆధార్ లతో అడ్డగోలుగా బుకింగ్
- అర్ధరాత్రి చీకటి మాటున తెలంగాణ కు తరలింపు
- పేదింటి కలను కబళిస్తున్న ఇసుక మాఫియా!
- అధికారుల నిర్వాకం తో కూటమి కి చెడ్డపేరు
- ఆధార్ తో ఆన్ లైన్ నిజమైన లబ్ధిదారులేనా?






**చింతూరు,ఫిబ్రవరి 2( మనం న్యూస్):** గత వైసీపీ ప్రభుత్వంలో అమలైన ఇసుక విధానంతో లక్షలాది పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందే. ఆ బాధను స్వయంగా గమనించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అధికారంలోకి వచ్చిన వెంటనే పేదల ఇల్లు కట్టుకునే కల నెరవేర్చాలనే లక్ష్యంతో ఉచిత ఇసుక పాలసీని తీసుకువచ్చారు.

### భారమని తెలిసినా ఉచితం

లోటు బడ్జెట్లో ఉన్నా సరే ప్రభుత్వానికి భారం అవుతుందన్న విషయం తెలిసినా సరే పేదవాడి ఇంటి కల నిజమవ్వాలని అన్న విజనరీ ఆలోచనతో కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుకను అందించే నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయానికి రాష్ట్ర ప్రజలే కాదు ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా హర్షం వ్యక్తం చేశారు. కానీ ప్రభుత్వం ఉద్దేశం ఒకటైతే జరుగుతున్న వాస్తవం మాత్రం మరొకటిగా మారింది. ఆంధ్ర,తెలంగాణ సరిహద్దులో ఇసుక మాఫియా రాజ్యం మేలటం దానికి పెద్ద అడ్డుకట్టగా మారింది. ఆంధ్ర,తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన గుండాల ప్రాంతంలో పేదలకు ఇసుక అందించాలనే ఉద్దేశంతో ఇసుక గుట్టలుగా నిల్వ చేసి, ప్రజల చేత ప్రజా పంపిణీ చేయాలని సొసైటీల ద్వారా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో స్థానిక సొసైటీలను ప్రోత్సహించి, వారి ద్వారా లబ్ధిదారులకు ప్రతి ఇంటికి ఉచిత ఇసుక చేరాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించుకున్నారు.అయితే ఈ వ్యవస్థలోకి ఇసుక మాఫియా చొరబడింది.ధనబలంతో,దౌర్జన్యంతో భయపెట్టి కొన్ని సొసైటీలను తమకు అనుకూలంగా మలుచుకున్నారనే ఆరోపణలు ఇప్పుడు పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారుతోంది.

### రెవెన్యూ - పోలీసు - సొసైటీ మూడు వ్యవస్థలూ నిర్వీర్యమా?

నిజానికి ఇసుక పంపిణీపై పర్యవేక్షణ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జరగాలి. కానీ అదే శాఖ కూడా మాఫియా ఒత్తిడికి తలవంచిన పరిస్థితి ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన పోలీసు వ్యవస్థ కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తోందన్న ఆరోపణలు ఈ ప్రాంతంలో జగమెరిగిన సత్యం.లబ్ధిదారులు ఆధార్ కార్డు ద్వారా మాత్రమే ఇసుక తీసుకోవాల్సి ఉండగా ఈ మాఫియా మాత్రం బయోమెట్రిక్ విధానం లేకపోవడం వల్ల తెలియని ఆధార్ కార్డులతో ఆన్లైన్ చేసి రాత్రికి రాత్రే ఇసుకను లారీల్లో లోడ్ చేసి కొద్దీ దూరంలో ఉన్న తెలంగాణ రాష్ట్రం లోని భద్రాచలంకు తరలిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

### పేదలకు 15% కూడా దక్కని ఇసుక

ప్రభుత్వం ఇచ్చే ఇసుకలో 15 శాతం కూడా స్థానిక పేదలకు అందడం లేదన్నది అత్యంత ఆందోళన కలిగించే అంశం.

దీంతో ఈ ప్రాంతం ఇసుక ద్వారా లబ్ధి పొందడం పోయి భారీగా నష్టపోతోంది. ప్రతిసారీ వరదలు వచ్చినప్పుడు సారవంతమైన భూమి కొట్టుకుపోవడం వల్ల నదులు లో ఇసుకగా మారి సారవంతమైన భూములు సౌడు నేలలగా క్రమంగా మారిపోతున్నాయి. ఇసుక పంపిణీలో పారదర్శకత ఉందా? బయోమెట్రిక్ ,సీసీ కెమెరాలు లేకపోవడం ఇటువంటి లోటుపోటులను ఆసరాగా భారీ వాహనాలలో ఇసుకను నింపి అర్థరాత్రి తోలకాలతో కోట్లు సంపాదిస్తూ పేదవాడికి అవసరమైన చిన్న ట్రాక్టర్లకు లోడింగ్ చేయకుండా ఇబ్బందులు గురి చేయడమే కాక కూటమి ప్రభుత్వం యొక్క పేదవాడి ఆశలకు గండి కొడుతున్న ఆ లోడింగ్ వ్యవస్థను తీసివేయాలని పలువురు కోరుకుంటున్నారు.

అంతేకాదు ఆ చుట్టుపక్కల గ్రామాలలో అర్ధరాత్రి వాహనాలు పెద్ద శబ్దాలతో వెళ్లిపోతుంటాయి ఆ ప్రాంతంలో ప్రజలు నిద్రకు నోచుకోని రాత్రులు ఎన్నో ఇలా పక్క రాష్ట్రాలకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నా ప్రజలు నోరు మెదపలేని పరిస్థితి. మాఫియా ఆగడాలకు భయపడి గ్రామీణులు మౌనంగా ఉండిపోతున్నారు.

### ప్రభుత్వం విచారణకు కమిటీ వేయగలరా?

ఒక్కసారి నిజమైన ఎంక్వయిరీ చేస్తే మాఫియా బండారం బయటపడుతుంది లబ్ధిదారి ఇంటి వద్ద నిజంగా ఇసుక ఉందా? ఇంటి నిర్మాణం జరుగుతోందా? లేదా పేరుకే లబ్ధిదారులా? ఈ అంశాలపై ఒక్కసారి సమగ్ర విచారణ జరిపితే ఇసుక మాఫియా, వారికి సహకరిస్తున్న వ్యవస్థలు అన్నీ బహిర్గతం అవుతాయన్నది స్థానికుల అభిప్రాయం. బీజేపీ ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు పాయం వెంకయ్య డిమాండ్ ఈ అంశంపై బీజేపీ రాష్ట్ర ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు పాయం వెంకయ్య స్పందిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక పాలసీ అభినందనీయం.

కానీ గుండాల ప్రాంతంలో ఆ ఇసుక పేదలకు కాకుండా బడా బాబుల చేతుల్లోకి వెళ్తోంది అనేది ఆరోపణ కాదు నిజమని ఈ ప్రాంత ప్రజలు అంటున్నారు నిజా నిజాలు ప్రభుత్వ యంత్రాంగమే తేల్చాలి లబ్ధిదారుల ఇంట్లో ఆ ఇసుక ఉందా వినియోగం అయ్యిందా లేదా పక్కదారి పట్టిందా అని నిజ నిర్ధారణ కమిటీ వేయాలని కోరుతున్నాను ప్రభుత్వానికి నా విన్నపం ఇదే కోటమే ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం ఈ ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు మంచి జరుగుతుంది ఆ ఉద్దేశంతోటే ఈ కుటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని అమలు చేస్తుంది.

దీంట్లో ఎవరైనా ప్రభుత్వాన్ని అబసపాలు చేయాలని చూస్తే చూస్తూ ఊరుకోం అంటూ ఘాటుగా స్పందిస్తూ వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకే ఇసుక పంపిణీ జరగాలి. రాత్రిపూట ఏ వాహనం కనిపించినా సీజ్ చేయాలి. ప్రత్యేక చెక్ పోస్టులు, జీపీఎస్ ట్రాకింగ్ అమలు చేయాలి. ఇసుక తరలిస్తున్న కాంట్రాక్ట్ కంపెనీపై కఠిన నిఘా అవసరం. అని డిమాండ్ చేశారు.

### ప్రభుత్వం స్పందిస్తుందా?

పేదల ఇసుక నిజంగా పేదలకే చేరుతుందా?పేదల ఇళ్ల కలను కాపాడే బాధ్యత ఇప్పుడు ప్రభుత్వంపై ఉంది. ఇసుక మాఫియాను అరికట్టి ప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందా? లేదా మంచు కొండలా గుండాల ఇసుక గుట్టలూ పేదల ఆశలూ కరిగిపోతాయా? అనేది వేచి చూడాలి.



## స్వామినాయుడు సేవలు అభినందనీయం

- సీఐ రాజనీకుమార్

**పాలకొల్లు, ఫిబ్రవరి 3,మనం ప్రతినిధి:** పాలమూరు గ్రామ సర్పంచ్ గా, కాన్వెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ గా పంచదార వెంకట లక్ష్మి స్వామి నాయుడు ను అందిస్తున్న సేవలు అభినందనీయం అని పాలకొల్లు పట్టణ సీఐ కోలా రాజనీకుమార్ అన్నారు. పాలకొల్లు ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్వర్యంలో జిన్నూర్ ఐడియల్ స్కూల్ లో ఆటల పోటీలు నిర్వహించినారు. దీనిలో భాగంగా పంచదార వెంకట లక్ష్మి స్వామి నాయుడు ను గ్రామ సర్పంచ్ హోదాలో సత్కరించారు.ముఖ్య అతిధులు తహసిల్దార్ -వై . దుర్గా కిశోర్,పట్టణ సీఐ రజని కుమార్ . ఎం ఈ ఓ : జి . వీరస్వామి పాలకొల్లు,ఏ శ్రీవాణి ఎలమంచిలి ఏం ఈ ఓ జి . విజయ కుమార్ పోడూరు ఎం ఈ ఓ పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లోఅసోసియేషన్ప్రెసిడెంట్:మహ్మద్ షాజాహన్ సెక్రటరీ:ఎం శ్రీరామ్ ట్రెజరేర్:ఏ . భాను ప్రకాష్ అసోసియేషన్ పెద్దలు: మద్దాల రాంప్రసాదు, రావూరి అప్పారావు ఐడియల్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ముఖలింగేశ్వరుని ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఫిబ్రవరి 15 నుంచి 18 వరకు మహాశివరాత్రి వేడుకలు
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ ఆదేశం




**శ్రీకాకుళం, ఫిబ్రవరి 03:** శ్రీముఖలింగ క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి ఆయన ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జలుమూరు మండలం శ్రీముఖలింగంలో ఫిబ్రవరి 15 నుంచి 18 వరకు నాలుగు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయని, చివరి రోజు చక్ర తీర్థ స్నానాలు మధ్యాహ్నం 12 గంటల నుంచి నిర్వహిస్తామన్నారు. గతంలో జరిగిన లోపాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి ఏర్పాట్లు పక్కాగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భక్తుల దర్శనానికి సంబంధించి క్యూలైన్లు, బారికేడ్ల ఏర్పాటులో ఎక్కడా జాప్యం జరగకూడదని సూచించారు. వంశధార నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు వీలుగా తగినంత నీటి నిల్వ ఉంచాలి. తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, జనరేటర్ల సౌకర్యం ఉండాలి. విద్యుత్ వైరింగ్ను ముందే తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉత్సవాల సమయంలో పారిశుద్ధ్యం ప్రధాన సమస్యగా మారకుండా తగినంత మంది కార్మికులను నియమించాలని జిల్లా పంచాయతీ అధికారికి కలెక్టర్ సూచించారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించాలని ఆర్అండ్బీ అధికారులను ఆదేశించారు. అత్యవసర వైద్య సేవల కోసం 104, 108 వాహనాలను సిద్ధంగా ఉంచాలని, ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ.. చక్రతీర్థ స్నానాల రోజు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎస్పీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. క్షేత్ర పరిసరాల్లో సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేస్తున్నామని, నదిలో గజ ఈతగాళ్లను నియమిస్తున్నామని చెప్పారు. భారీ సంఖ్యలో పోలీసు బలగాలను మోహరిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ లక్ష్మణమూర్తి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్, ఆలయ ఈవో ఏడుకొండలు, డీపీఓ భారతి సౌజన్య, ఇన్చార్జి ఆర్డీవో జయదేవీ, ఆర్ అండ్ బి ఎస్ఈ సత్యనారాయణ సత్యనారాయణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అనిత, ఫైర్ ఆఫీసర్ మోహనరావు పాల్గొన్నారు.

# అలంకరణ చేపల పెంపకం యూనిట్లు గ్రౌండింగ్



**కాట్రేనికోన, ఫిబ్రవరి 3 మనం ప్రతినిధిః** మత్స్య శాఖ, డాక్టర్ బి ఆర్ . అంబేద్కర్ కోనసీమ జిల్లా మరియు జి సి ఎఫ్ ఈ ఆర్ ఐ సి సి - సెర్ప్ -డి ఆర్ డి ఏ వారి ఆధ్వర్యంలో అలంకరణ చేపల పెంపకం కొరకు యూనిట్లు మంజూరు చేయబడినవి. దీనిలో భాగముగా కాట్రేనికోన మండలంలో చిరయాణం మరియు పల్లం లో ఏర్పాటు చేసిన యూనిట్లలలో మంగళవారం రంగు చేపల విత్తనములు విడుదల కార్యక్రమం పల్లం,(2 యూనిట్స్) చిర్రయానం(2 యూనిట్స్)మొత్తం నాలుగు యూనిట్లు రెండు గ్రామాలలో గ్రౌండింగ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ డి డి ఎఫ్ , ఎల్ వి ఎఫ్. వర్ధన్,కాట్రేనికోన మత్స్య అభివృద్ధి అధికారి, కె.చలపతి,గ్రామ మత్స్య సహాయకులు వి మీనా కుమారి, జిసిఎఫ్ ప్రతినిధి శ్రీ హర్ష, రంగు చేపల వర్తక దారుల రాష్ట్ర ప్రెసిడెంట్, వీరబాబు, పల్లం గ్రామ పెద్దలు దండుప్రోలు సత్యం, బాలయోగి చిర్రయాణం గ్రామ పెద్దలు అంగాని నరసింహ మూర్తి మరియు లబ్దిదారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ యువతకు వ్యాపార, ఉపాధి అవకాశాలపై చర్చ



- భాగస్వామ్యమైన వివిధ విభాగాల అధికారులు

**విశాఖపట్నం, ఫిబ్రవరి 3:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, ఎస్సీ, ఎస్టీ యువతను ఔత్సాహికులుగా తీర్చిదిద్దడంతో పాటు స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించుకునేలా అవగాహన కల్పించే ఉద్దేశంతో సంక్షేమ భవన్లో మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించుకొని వివిధ అంశాలపై చర్చించుకున్నారు. జిల్లా మానిటరింగ్ కమిటీ, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, సామాజిక సంక్షేమ శాఖ, జిల్లా పరిశ్రమల కేంద్రం, అృఐఐఅ, స్కిల్ డెవలప్మెంట్, ృఖఅ, ఎస్సీ కార్పొరేషన్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ , ఉపాధి కార్యాలయం, ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ వివిధ సంక్షేమ, ఆర్థిక సహాయ పథకాలు, రుణ సౌకర్యాలు, శిక్షణ కార్యక్రమాలపై వివరించి, ఎస్సీ, ఎస్టీ యువత స్వయం ఉపాధి ద్వారా ఆదాయాభివృద్ధి సాధించి, ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగడానికి దోహదపడే అంశాలపై చర్చించారు. యువతలో వ్యాపార దృక్పథం పెంపొందించి, జిల్లాలో ఉపాధి అవకాశాల విస్తరణకు సమష్టి చర్యలు తీసుకోవాలని, ఉమ్మడి కార్యాచరణతో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నారు.

# ఐఎఫ్ ఆర్కు బీచ్ రోడ్డును ఆకర్షణీయంగా తీర్చిదిద్దండి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



**విశాఖపట్నం మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి ఫిబ్రవరి 3:** అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష (ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ) కు దేశ విదేశాల నుండి ఎంతోమంది అతిధులు వస్తారని అందుకు విశాఖ బీచ్ రోడ్డును ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఫిబ్రవరి 15నుండి జరుగనున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ కొరకు జీవీఎంసీ పనులపై ఆర్కే బీచ్ పరిసర ప్రాంతాలను జీవీఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ ముందుగా ఆర్కే బీచ్ వద్ద ఒక పొర వేసిన బీటీ రోడ్డును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న నిర్వహించే ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూకు ఎంతోమంది దేశ విదేశాల నుండి అతిధులు వస్తారని అందుకు విశాఖ బీచ్ రోడ్డును ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించామన్నారు. బీచ్ రోడ్డులో , బీచ్ లో వ్యర్థాలు లేకుండా పారిశుద్ధ్య కార్మికులతో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని, బీచ్ క్లీనింగ్ మిషన్ల సహాయంతో ఇసుకలోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని , రాత్రి పారిశుధ్య పనులపై నిత్య పర్యవేక్షణ జరపాలని ప్రజా ఆరోగ్య అధికారులను ఆదేశించారు. విద్యుత్ దీపాలు, సోలార్ లైటింగ్ అన్ని పూర్తిస్థాయిలో వెలిగేలా నిరంతర పర్యవేక్షణ జరుపుతూ తగిన చర్యలు చేపట్టాలని, ఫుట్ పాతులను మరమ్మతులు చేపట్టి పెయింటింగ్ పనులు, రోడ్డు మార్కింగ్లు పూర్తి చేయడంతో పాటు సెంటర్ మీడియన్లను వ్యర్థాలు లేకుండా ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను, హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, ప్రజా ఆరోగ్య విభాగం అధికారులు ఇంటర్నేషనల్ ఫీట్ రివ్యూ పూర్తయ్యేవరకు సంయుక్త కార్యాచరణ చేపట్టి సంబంధిత పనులను వెంటనే పూర్తయ్యేలా చూడాలన్నారు. విశాఖ లో నిర్వహించే ఫ్లీట్ రివ్యూ కు విశాఖ మ్యూజియమును అతిథులు, సందర్శకులు సందర్శిస్తారని అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయడంతో పాటు మ్యూజియంను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి. నల్లనయ్య ,ప్రధాన ఇంజనీరు పీవీ సత్యనారాయణ రాజు, ఈస్ట్ జోన్ జోనల్ కమిషనర్ కె .శివప్రసాద్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు సంపత్ కుమార్ ఏడుకొండలు తిరుమలరావు, కార్యనిర్వాహక ఇంజనీర్లు గంగాధర్, మురళీకృష్ణ ,సహాయక వైద్యాధికారులు, పాల్గొన్నారు.

# 6,7, 8 తేదీలలో హైదరాబాద్లో చిత్రకళా ప్రదర్శన

**కాట్రేనికోన ఫిబ్రవరి 3 మనం ప్రతినిధిః** కాట్రేనికోన కి చెందిన క్రియేటివ్ హార్ట్స్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆరట్స్ చిత్రకళా సంస్థ మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయ వృత్తులు, సంప్రదాయ కళలు ఇతివృత్తంగా జాతీయ స్థాయిలో 80 మంది ప్రముఖ చిత్రకారులతో ప్రదర్శనగా హైదరాబాద్ లోని జే ఎన్ ఏ ఎఫ్ ఏ యు లో గల నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో ఈ నెల 6,7,8 తేదీల్లో నిర్వహించనున్నారు ఈ ప్రదర్శనలో పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, కేరళ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల నుండి చిత్రకారులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జే ఎన్ ఏ ఎఫ్ ఏ యు వైస్ ఛాన్సలర్ గంగాధర్ ప్రిన్సిపల్ ఆనంద్ కుమార్ ఆంధ్రప్రదేశ్ కల్చర్ చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి ప్రముఖ సినీ హీరో సుబ్బు చంద్రగిరి పాల్గొననున్నారని నిర్వాహకులు కాట్రేనికోన కు చెందిన చిత్రకారుడు అంజి ఆకొండి తెలిపారు.

# అన్నదాతకు అండగా.. హక్కు పత్రాల పంపిణీ



- ఎమ్మెల్యే కూన రవికుమార్

**సరుబుజ్జిలి, ఫిబ్రవరి 3(మనంన్యూస్):** రైతు చేతిలో భూమి యాజమాన్య పత్రం ఉంటేనే అది భవిష్యత్తుకు భరోసాగా నిలుస్తుందని, అన్నదాతకు తన భూమిపై స్పష్టమైన హక్కు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన సంకల్పమని ఆముదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ స్పష్టం చేశారు. లోద్దల కాగితపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతును ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భూ సంబంధిత వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపి, రైతులకు పరిపూర్ణమైన భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాలు ఉండటం వల్ల బ్యాంకు రుణాలు పొందడం సులభతరమవుతుందని, తద్వారా సాగు పెట్టుబడికి ఇబ్బందులు తప్పుతాయని వివరించారు. రెవెన్యూ రికార్డుల్లో ఎటువంటి లోపాలు లేకుండా పారదర్శకమైన చర్యలు తీసుకుంటున్నామని, రైతులందరికీ మేలు చేయడమే తమ బాధ్యతని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ శివాల సూర్యం, మండల అధ్యక్షులు అంబాలా రాంబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు, రెవెన్యూ అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ నుండి చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

- మంత్రి కందుల దుర్గేష్
- త్వరలోనే నంది అవార్డులు, నంది నాటకోత్సవాలపై ప్రకటన
- సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అభినందనలు ఘనంగా సత్కారం



**అమరావతి,ఫిబ్రవరి 3(మనంప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగు చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి సంబంధించి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఏప్రిల్ నుండి ఇందుకోసం అవసరమైన కార్యాచరణను ప్రారంభిస్తామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. మంగళవారం వెలగపూడి సెక్రటేరియట్ రెండవ బ్లాక్ లోని ఛాంబర్ లో మంత్రి కందుల దుర్గేష్ ఆంధ్ర ప్రదేశ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ - 2026 పోటీల్లో గెలుపొందిన విజేతలను సత్కరించారు. అవార్డు గ్రహీతలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా సామాజిక స్పృహతో లఘు చిత్రాలు రూపొందించిన యువ దర్శకులు, సాంకేతిక నిపుణులు, నటీనటులను మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు. ఏపీ చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధిలో భాగంగా జనవరి 11న రాష్ట్రస్థాయిలో ఎలాంటి ఎంట్రీ ఫీజు లేకుండా ప్రతిష్టాత్మకంగా 'మా-ఏపి' ఆధ్వర్యంలో తెనాలిలో ఆంధ్ర ప్రదేశ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ - 2026 ను విజయవంతంగా నిర్వహించినందుకు ఆంధ్ర ప్రదేశ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ పోటీల నిర్వాహకుడు,మా-ఏపీ వ్యవస్థాపకులు, సినీదర్శకులు దిలీప్ రాజా కృషిని కొనియాడారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లతో చర్చించి త్వరలోనే నంది అవార్డులు, నంది నాటకోత్సవాల నిర్వహణపై ప్రకటన చేస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ హైదరాబాద్కు ధీటుగా అమరావతిని సినిమా రంగానికి కేంద్రబిందువుగా మార్చాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉందని స్పష్టం చేశారు. సామాజిక చైతన్యంతో కూడినటువంటి చిత్రాలకు దర్శకత్వం వహించిన దర్శకులు దిలీప్ రాజా ఏపీలో తెలుగు చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధి చేయాలని నిరంతరం తపిస్తున్నారని అన్నారు. సినిమా రంగం అభివృద్ధికి ఏపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కేవలం ఆంధ్ర ప్రదేశ్ లోని ఔత్సాహిక కళాకారులను మాత్రమే ప్రోత్సహించేందుకు నిర్వహించిన ఆంధ్ర ప్రదేశ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 203 షార్ట్ ఫిల్మ్ ఎంట్రీలురాగా 2 వేల మంది నటీనటులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నానికి చెందిన చంద్రశేఖర్ శకునాల తీసిన ' మహావృక్షం' ప్రథమ బహుమతిని పొందగా శ్రీకాకుళంకు చెందిన శ్రీనివాసరావు 'సింహాద్రి అప్పన్న' ద్వితీయ బహుతిని, పాలకొల్లుకు చెందిన నవీన్ కుమార్ ' అబద్దం వర్సెస్ నిజం' తృతీయ బహుమతిని పొందింది. ఈ సందర్భంగా మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు లక్ష రూపాయల నగదును అందించారు. ఉత్తమ నటిగా సుజిత( మనం), ఉత్తమ కేరెక్టర్ నటిగా సాయి ప్రకర్ష ( అబద్దం వర్సెస్ నిజం) నటుడు పవన్ శర్మ( మన్ను-మిన్ను) బాలనటి హర్షతున్నీసా,యంగ్ టాలెంట్ రిత్విక్ రెడ్డి (అస్త్ర) త్రివిక్రమ్ (డెబ్యూ డైరెక్టరు ) విలన్ మీసాల భాస్కర్,తెలుగు స్క్రిప్ట్ పరిశీలకులు మంజులూరి లక్ష్మీపతి మాస్టర్, జగదీష్,దర్శకత్వం నరేష్ దోనె తదితరులను సినిమాటోగ్రఫి మంత్రి కందుల దుర్గేష్ సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా దర్శకులు దిలీప్ రాజా మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటే ఏపీ యువత అద్భుతాలు సృష్టించగలరని, ఆంధ్ర ప్రదేశ్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని అన్నారు. మరింత ప్రోత్సాహం అందిస్తే ఎవరెస్ట్ నైనా ఎక్కగలమనే దృఢ సంకల్పాన్ని విజేతల్లో నింపామని దిలీప్ రాజా పేర్కొన్నారు.

## సూపర్ బజార్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో

# కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



**విశాఖపట్నం, ఫిబ్రవరి 03 :** సూపర్ బజార్ సబ్రిజిస్ట్రార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలు, పత్రాల పరిశీలన, స్టాంప్ డ్యూటీ వసూలు విధానాలపై సమగ్రంగా పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వ, ప్రయివేటు భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అనుసరిస్తున్న విధానాలు, అవలంబిస్తున్న పద్ధతులు, నిబంధనలు తదితర అంశాలపై కూలంకషంగా అడిగి తెలుసుకున్నారు. సేవల్లో ఎలాంటి జాప్యం జరగకుండా, పారదర్శకంగా అందించాలని అధికారులను ఆదేశించారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, నిబంధనల ప్రకారం పని చేయాలని, ప్రతి దరఖాస్తుదారుడికి సమానంగా సేవలు అందేలా చూడాలన్నారు. రికార్డుల నిర్వహణలో లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని, సిబ్బంది హాజరు, పనితీరుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో వేచి ఉన్న పౌరులతో మాట్లాడిన కలెక్టర్ సేవలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర, సబ్ రిజిస్ట్రార్ కనకరత్నం, ఇతర అధికారులు ఉన్నారు.

# మూడు ప్రత్యేక కార్యక్రమాలపై సిపి సమావేశం



**విశాఖపట్నం మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి ఫిబ్రవరి 3:** ఈ నెల 14 నుండి 25 వరకూ విశాఖ నగరంలో ప్రతిష్టాత్మకంగా మూడు కార్యక్రమాలు ఐ.ఎఫ్.ఆర్, మిలాన్, ఐయాన్స్-కాన్ క్లేవ్ అఫ్ చీఫ్స్ నిర్వహించనున్న నేపథ్యంలో నగర కాన్ఫరెన్స్ హల్ నందు పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి, అన్ని శాఖలతో కలిసి సమావేశం నిర్వహించారు.నగర పోలీసు ఉన్నతాధికారులతో పాటుగా, నేవి అధికారులు, బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ అధికారులు, ఎయిర్ పోర్టు, సీ పోర్టు అధికారులు, సి.ఐ.ఎస్.ఎఫ్ అధికారులు, ఫిషరీస్ శాఖ అధికారులు, రైల్వే పోలీసు అధికారులు, ఫైర్ డిపార్ట్మెంట్ అధికారులు, నగర ట్రాఫిక్ అధికారులు, ఏ.డి.సి.పి లు, ఏ.సి.పి లు, సంబంధిత సీఐ లు పాల్గొన్న ఈ సమావేశం నందు ఐ.ఎఫ్.ఆర్, మిలాన్, ఐయాన్స్-కాన్ క్లేవ్ అఫ్ చీఫ్స్ కార్యక్రమాలు ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖలను సమన్వయపరచుకుంటూ నిర్వహించడానికి కావలసిన చర్యలపై చర్చించిన పోలీసు కమిషనర్ పలు అదేశాలు జారీ చేశారు ఈ సమావేశం లో ప్రధానముగా ఇమ్మిగ్రేషన్ పై, పోలీసు బందొబస్తు పై, భద్రత పై, కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాలపై, పార్కింగ్ ప్రాంతాలపై, నో-డ్రోన్ జోన్ పై, పలు దేశాల ప్రతినిధుల రాక పోకల పై, విశిష్ట అతిధుల సందర్శనలపై, ముఖ్య కార్యక్రమాలు, ముఖ్య అతిధులపై, ముఖ్య అతిధుల రోడ్డు మార్గాలపై, ఇతర అంశాలపై చర్చలు జరిపి తగు కార్యాచరణకు ప్రణాళిక రూపొందించారు.

# పేద కుటుంబాన్ని ఆదుకున్న ఆర్ పి ఎల్ఐ

- మృతురాలి భర్తకు రూ. 5.31లక్షల బీమా చెక్కు అందజేత
- బీమా చెక్కును అందజేస్తున్న పోస్టల్ సూపరిడెంట్ జి. జనార్ధన్ రెడ్డి




**తుగ్గలి, ఫిబ్రవరి 03 (మనం న్యూస్):** అకస్మాత్తుగా పాలసీదారురాలు మరణించడంతో ఒక పేద కుటుంబానికి రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకం (ఆర్పీఎస్ఐ) ఆదు కుంది. తుగ్గలి మండలం, జొన్నగిరి గ్రామానికి చెందిన జి. శాంతి కూలీ పనులు చేసు కుంటూ జీవించేవారు. ఇటీవల ఆమె ప్రమాదవశాత్తు మరణించడంతో ఆమె భర్త, పిల్లలు అయోమయ స్థితిలోకి వెళ్లిపోయారు. గతంలో జి. శాంతి అనే మహిళ ఆర్ పి ఎల్ ఐ కింద ఒక వార్షిక ప్రీమియం మాత్రమే చెల్లించారు. ఇంత లోనే ఆమె ప్రమాద వశాత్తు మరణించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆమె భర్త జి. ఆంజనేయులుకు ఉప్పర్లపల్లె గ్రామంలో జీవిత బీమా రూ 5 లక్షల 31వేలు,630 లు చెక్కును కర్నూలు డివిజన్ పోస్టల్ సూపరిడెంట్ జి. జనార్ధన్ రెడ్డి అందజేశారు. అలాగే 12 సుకన్య పథకం పాస్ బుక్కులు గ్రామంలోని బాలికలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆర్ పి ఎల్ ఐ భీమా చెల్లిస్తే కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు అప్పా వేణుగోపాల్, సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస గౌడ్, ఉపసర్పంచ్ రామాంజనేయులు, స్థానిక బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ అప్పా వెంకటేశ్వర్లు, పోస్టల్ ఖాతాదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రాయలసీమ లిఫ్టు ఇరిగేషన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యేలు



జూపాడు బంగ్లా, ఫిబ్రవరి 3 (మనం న్యూస్): జూపాడు బంగ్లా మండలంలోని పోతులపాడు హెడ్ రెగ్యులేటర్ దగ్గర ఉన్న రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ను పరిశీలించి.పోతిరెడ్డిపాడు వద్ద మీడియా సమావేశం నిర్వహించిన నంద్యాల జిల్లా అధ్యక్షురాలు మరియు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి , నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య .ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ చుట్టూ వైఎస్ఆర్సిపి చేస్తున్న విషయం రాజకీయ ప్రచారాన్ని చేస్తున్నారు, ఈ రోజు రాయలసీమలో ప్రస్తుతం ఉన్న అన్ని నీటిపారుదల ప్రాజెక్టులు, జలాశయాలలో నీటి లభ్యత నిండుగా ఉంది అన్నారు, అయితే వైయస్సార్సీపి పార్టీ వాళ్లు తమ రాజకీయ ప్రయోజనాల కోసం కృత్రిమ నీటి సంక్షోభాన్ని సృష్టించే ప్రయత్నం ఏ విధంగా చేస్తుందో ప్రజలకు తెలుసు అని అన్నారు. ఈ రాయలసీమ అంతటా నీటి లభ్యత, కొనసాగుతున్న నీటిపారుదల వినియోగం, వ్యవసాయ కార్యకలాపాలు మరియు రైతుల విశ్వాసాన్ని కళ్లకు కట్టినట్లు చూపించడం ద్వారా ప్రజలకు కూటమి ప్రభుత్వం పట్ల ఉన్న విశ్వసనీయత మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. అదేవిధంగా నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం రాయలసీమలో నీటి కొరత లేదు: ప్రస్తుతం ఉన్న కాలువలు, జలాశయాలు మరియు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందుబాటులో ఉంది అని నీరు అందించడానికి రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పునః ప్రారంభించాలనే వాదన, కానీ ఇప్పటికే క్షేత్రస్థాయిలో నీటిని అందిస్తున్న అనేక ఇతర ప్రాజెక్టులను ప్రభుత్వం క్షేత్రస్థాయిలో నీరు అందేలా పని చేస్తోంది అనీ. గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం తమ హయంలో సాగునీటి పనులను నిలిపివేసి, ఇప్పుడు నిరసనలకు దిగగా, ప్రస్తుత మన కూటమి ప్రభుత్వం 12,441 కోట్ల విలువైన సాగునీటి పనులను పూర్తి చేసి, పునరుద్ధరించి రైతులకు నీటి లభ్యతను హామీ ఇచ్చింది అన్నారు.ఇది నినాదాలకు, నిశ్శబ్దానికి మధ్య జరుగుతున్న పోరాటం కాదు; ఇది ప్రత్యక్షంగా కనిపిస్తున్న నీరు, పనిచేస్తున్న కాలువలు మరియు సాగులో ఉన్న పొలాలకు, రాజకీయంగా సృష్టించబడిన ఆందోళనకు మధ్య ఉన్న వ్యత్యాసం అన్నారు. పొలాలకు సాగునీరు అందుతోందని ధృవీకరించడానికి నాయకులు రైతులతో నేరుగా మాట్లాడాలి. వ్యవసాయ పనులు సాగుతున్నాయని మరియు వైకాపా నాయకులు ఆరోపణలు వాస్తవ పరిస్థితికి భిన్నంగా ఉన్నాయని రైతుల సాక్ష్యాలు బలపరచాలి అన్నారు.నిరంతర నీటి సరఫరా మరియు సాగునీటి స్థిరత్వాన్ని గుర్తిస్తూ, నియోజకవర్గంలోని వృద్ధులు నాయకులను ఆశీర్వదించాలి. ఇది రాజకీయ ఆందోళనల కంటే పాలనపై నమ్మకాన్ని మరింత పెంచుతుందనీ ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. ఈ కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, మండల కన్వీనర్ గుండ్రెడ్డి మోహన్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ గిరీశ్వర్ రెడ్డి, 80 బన్నూరు సొసైటీ చైర్మన్ పిక్కిలి శ్రీనివాసులు, రవికాంత్, వేణుగోపాల్ రెడ్డి, తుడిచెర్ల వెంకట రాముడు, కూటమి నాయకులు రైతులు నీటి సంఘం నాయకులు ప్రజలు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# రైతులే స్వయంగా ఈ పంట నమోదు చేసుకోవచ్చు

- వ్యవసాయ అధికారి పవన్ కుమార్



గడివేముల, ఫిబ్రవరి 3(మనం న్యూస్): గడివేముల మండలం బుజునూరు గ్రామంలో జొన్న పంట సాగు చేసిన రైతులతోనే స్వయంగా ఈ పంట నమోదు కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి జీకే . పవన్ కుమార్, ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన 2.0 యాప్ ద్వారా స్వయంగా రైతులే ఈ పంట నమోదు చేసుకోవచ్చు. అలాగే పంట సాగు వివరాలు తెలుసుకోవచ్చు. రైతులు గూగుల్ ప్లే స్టోర్ నుండి '2.0' యాప్ డౌన్లోడ్ చేసుకోవాలి. ఆధార్ ఓటీపీ ద్వారా లాగిన్ అయి, 'నా పొలాలు' విభాగం లో సాగు వివరాలను సమోదు చేయవచ్చు. వీటిని రైతు సేవా కేంద్రం సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి ధ్రువీకరిస్తారు. ఒకవేళ వివరాలు తప్పుగా ఉంటే గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. రైతులు స్వయంగా పంట నమోదు చేసేటప్పుడు ఏమైనా ఇబ్బందులు ఉంటే మీ గ్రామ రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించండి. పంట నమోదు సమయంలో రైతులకు మూడు దశల్లో సంక్షిప్త సమాచారం అందుతుంది. నమోదుకు ముందు రోజు ఒకటి, నమోదు పూర్తయ్యాక వివరాలతో కూడిన లింక్ ద్వారా రెండో మెసేజ్ వస్తుంది. ఆ లింక్ ఓపెన్ చేసి వివరాలు సరిచూసుకుని చేస్తే మూడో ధ్రువీకరణ మెసేజ్ వస్తుంది. వివరాలు తప్పుగా ఉంటే ఖ్లుచ్చి చేయవచ్చు. 'ఈ-పంట' యాప్ ద్వారా పంట నమోదు ను రెవెన్యూ సిబ్బంది మరియు వ్యవసాయ సిబ్బంది కలిసి జాయింట్ గా చేయడం జరుగుతుంది. ఈ పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పీఎం కిసాన్ -అన్నదాత సుఖీభవ, పంటల కొనుగోలు, రుణాలు, యూరియా పంపిణీ వంటి పథకాలు అందుతాయి. ఈ కార్యక్రమంలో ,వ్యవసాయ విస్తరణ అధికారి మోహన్ , గ్రామ వ్యవసాయ సహాయకులు హబీబ్ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# 7న ముఖ్యమంత్రి జిల్లా పర్యటన



కర్నూల్, ఫిబ్రవరి 3 (మనంబ్యూరో): రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనెల 7న కర్నూలు జిల్లా పర్యటన లో భాగంగా ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో నిర్వహించనున్న పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్, ప్రజావేదిక, రైతులతో ముఖాముఖి కార్యక్రమాల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి , ఎస్పీ విక్రాంత్ పాటిల్ , ఎమ్మెల్యే జయ నాగేశ్వరరెడ్డి , జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పరిశీలించారు

# వాతావరణ పర్యవేక్షణకు ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు



- జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూల్, ఫిబ్రవరి 3(మనం బ్యూరో): ఖచ్చితమైన, రియల్ టైమ్ వాతావరణ పర్యవేక్షణ కోసం ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు నిరంతర డేటాను అందిస్తాయని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. మంగళవారం ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలోని ఏపీ ట్రాన్స్ కో కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు ఆర్టీజీఎస్ కు అనుసంధానం అయ్యాయన్నారు. ఈ కేంద్రం ద్వారా వర్షపాతం, నేలలో తేమ, వాతావరణ పీడనం, గాలి, ఉష్ణోగ్రత వంటి వివరాలు ఆటోమేటిక్ గా ఆన్లైన్ లో నమోదు అవుతాయని తెలిపారు. తుఫాను లాంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో ముందస్తు హెచ్చరికలు జారీ చేయడానికి, వ్యవసాయ ప్రణాళికలు రూపొందించడానికి సంబంధిత వాతావరణ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ కేంద్రానికి సంబంధించిన యంత్రాల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని, ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఓ భారతి, డివైఎస్ఓ భాస్కర్, రామాంజనేయులు, ఏ ఎస్ ఓ సరళ కుమారి, తదితరులు పాల్గొన్నారు.



# చెట్నెహాళ్ళిలో రూ. 10 లక్షలతో సీసీరోడ్లు

మంత్రాలయం ,ఫిబ్రవరి 3మనం న్యూస్: మంత్రాలయం మండల పరిధిలోని చెట్నెహాళ్ళి గ్రామంలోని మంత్రాలయం టీడీపీ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు రూ. 10 లక్షల తో సీసీరోడ్లు నిర్మాణ పనులను మంచాల సొసైటీ డైరెక్టర్ చాపల నాగేష్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్జీఎస్ నిధులతో గ్రామంలోని ఈడిగా ఉసేన్ ప్ప ఇంటి దగ్గర నుంచి చిన్న తాత రామాంజినేయులు ఇంటి వరకు రూ. 5 లక్షల , మరో రూ. 5లక్షల తో ఎంపిపి స్కూల్ నుంచి గ్రామ చావిడి వరకు సీసీరోడ్లు వేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రోడ్డు కాంట్రాక్టర్ శీను , టీడీపీ నాయకులు డీలర్ గోపాల్ , వెంకటరాముగౌడ్ , కురువ జయన్న , ఈడిగా ఉసేనప్ప , తదితరులు ఉన్నారు.

# నల్లచెలిమిలలో గోకుల మిషన్ కింద లేగ దూడల ప్రదర్శన

- లింగ నిర్ధారిత వీర్యంతో పాడి పశువుల అభివృద్ధికి శాస్త్రీయ మార్గం



దేవనకొండ, ఫిబ్రవరి 3 (మనం న్యూస్): నల్లచెలిమిల గ్రామంలో రాష్ట్రీయ గోకుల మిషన్ కార్యక్రమంలో భాగంగా లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పశుపోషక రైతుల నుంచి విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి డాక్టర్ రాజశేఖర్ గారు మాట్లాడుతూ, పాడి పశువుల సంఖ్యను త్వరితగతిన పెంచుకోవాలంటే లింగ నిర్ధారిత వీర్యం ద్వారా కృత్రిమ గర్భధారణ చేయించుకోవడం అత్యంత ప్రయోజనకరమని సూచించారు. దీని ద్వారా మేలు జాతికి చెందిన ఆడ దూడలు ఎక్కువగా జన్మించి రైతులకు ఆర్థిక లాభం చేకూరుతుందని తెలిపారు. పశుగణాభివృద్ధి సంస్థ సహాయ సంచాలకులు డాక్టర్ బి. మల్లన్న గారు, గోనెగండ్ల ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ జి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పశువు ఈనిన మూడు నెలల అనంతరం మరలా చూడి కట్టించడం ద్వారా ఉత్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని వివరించారు. పశువుల ఆరోగ్య సంరక్షణలో పోషకాహారం, టీకాలు, పరాన్నజీవుల నివారణ కీలకమని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 69 లేగ దూడలకు నట్టల నివారణ మందులు త్రాగించారు. మేలు జాతి దూడలను పెంచుతున్న రైతులను ప్రత్యేకంగా ప్రోత్సహిస్తూ బహుమతులు అందజేశారు. దూడల ఆరోగ్యాభివృద్ధికి అవసరమైన విటమిన్ టానిక్స్ను కూడా పంపిణీ చేశారు.
గ్రామ సర్పంచ్, వెలమకూరు పశు వైద్యాధికారి డాక్టర్ కె. అనీల, ఇఅ హనుమన్న, పశు వైద్య సిబ్బంది, గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రైతులకు ఆధునిక పశుపోషణ పద్ధతులపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# దిశా నిర్దేశం చేసేందుకే కొనసాగిస్తున్నాం



కర్నూలు ఫిబ్రవరి 03మనం న్యూస్: భారతదేశ అత్యంత చారిత్రక మైన వేదికగా కొనసాగిస్తూ, దిశా నిర్దేశం చేసేందుకే కొనసాగిపు చేపట్టడం సంతోషాన్నిచ్చిందని బ్లెండర్స్ ప్రైడ్ సీఎంవో దేబ శ్రీ దాస్ గుప్తా పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వినూత్నమైన ఫ్యాషన్ షోలను నిర్వహించినట్లు చెప్పారు. తన ఫ్యాషన్ టూర్ ను 3 ప్రధాన నగరాల వ్యాప్తంగా ఫ్యాషన్ అనుభవాలు విజయ వంతంగా పునర్నిర్వచించి, మైమరిపించే విధంగా అధునాతనమైన మార్గంలో ఫ్యాషన్ ముందుకు సాగేందుకు మార్గం సుగమం చేసిందని చెప్పారు. భవిష్యత్తు పరిణామాలకు నాంది పలికే ద వన్ ఎండ్ ఓన్లీ ( ఒకే ఒక్కటి)ని సృష్టించిన మూడు వినూత్నమైన కథనాలను సమర్పించిందని అన్నారు. ఎఫ్ డి సి ఐ చైర్మన్ సునీల్ సేఠి మాట్లాడుతూ బ్లెండర్స్ ప్రైడ్ ఫ్యాషన్ టూర్ తో తమ సహాయ సహకారాల పట్ల ఎంతో ఉత్సాహంతో ఉన్నామన్నారు. 2,100 కు పైగా హాజరైన ప్రభావ వంతమైన శ్రోతలను, మార్గ దర్శకత్వం కోసం రూపొందించి నట్లు తెలిపారు. ఇది ఫ్యాషన్ ప్రపంచంలో రెండు శక్తి క్షేత్రాలను ఒక చోటికి చేర్చిందని గుర్తు చేశారు. తమ నిబద్ధతను ఇది మరింతగా పెంపొందిస్తుందని చెప్పారు.సృజనాత్మకత, సంస్కృతిని వేడుకగా జరుపుకునే వైవిధ్య భరితమైన డిజైన్ దృక్కోణాలను ఒకే చోటికి చేర్చి, దేశ భవిష్యత్తు ఫ్యాషన్ కు వడిని కూర్చింది ఈ ఎడిషన్ అన్నారు.

# పాస్ పుస్తకాలలో తప్పులను సరి చేసుకోవాలి

మంత్రాలయం,ఫిబ్రవరి 03మనం న్యూస్: పట్టాదారు పాస్ పుస్తకాల కోసం రైతులు తప్పులు సరి చేసుకోవాలని మంత్రాలయం తహశీల్దారు రమాదేవి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలోని సచివాలయంలో రైతులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో రీ-సర్వే పూర్తి అయ్యిందని కావున రైతులకు ఆన్ లైన్ అడంగల్, వన్ బి, సర్వే నెంబర్, ఖాతా నెంబర్, ఎల్ పిఎం నెంబర్ లను కరెక్ట్ గా ఉన్నాయో లేదో చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ ఓ ఆనందు, టిడిపి నాయకులు బంద్రాళ్ల నరసింహులు, పోలిశివ, చిదానంద, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ ఎంపీడీవో పదోన్నతులు కల్పించారు

- 660 మంది కి జీతాలు మాత్రం మరిచారు
- తక్షణమే చెల్లించాలని డిమాండ్

పాలకొల్లు, ఫిబ్రవరి 3,మనం ప్రతినిధి : ఏపీ రాష్ట్రవ్యాప్తంగా గ్రేడ్ వన్ పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న 660 మంది గ్రామ కార్యదర్శులకు వార్డు సచివాలయాల పర్యవేక్షణ కోసం డిప్యూటీ ఎంపీడీవోల హోదాలో పదోన్నతులు కల్పించారు. ఇది జరిగి రెండు నెలలకు పైబడి అవుతోంది. ఇంకా ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. పదోన్నతులు ఇచ్చిన వెంటనే జీతాలుకు సంబంధించి ఏర్పాట్లు కూడా చేయాల్సి ఉండగా జీతాలు చెల్లించడం లో జాప్యం చేయడం దురదృష్టకరమైన పలువురు విమర్శిస్తున్నట్లు తెలిసింది. కొందరికి ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు నిర్వహించడంతో వారికి మరింత భారంగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సచివాలయం ఉద్యోగులు సర్వేలు, ప్రజలకు సేవలు అందించడంలో నిర్లక్ష్య వైఖరి అవలంబించడంతో సూపర్వైజర్లు గా వచ్చిన డిప్యూటీ ఎంపీడీవోలు తలలు పట్టుకునే పరిస్థితి నెలకొన్నట్లు తెలిసింది. ఒకవైపు జీతాలు సకాలంలో రాకపోవడం మరోవైపు సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్య వైఖరి వల్ల ఉన్నత అధికారులు ఒత్తిడి తో సతమతమవుతున్నట్లు తెలుస్తోంది. గ్రామపంచాయతీలో సమస్యల బెడద ఎక్కువ కావడంతో ఎంతో కొంత మానసిక ప్రశాంతతో ఉద్యోగాలు చేసుకుందామని డిప్యూటీ ఎంపీడీవో పదోన్నతి పై సచివాలయాలకు వస్తే జీతాలు నిలిచి పోవడం, సచివాలయం ఉద్యోగుల నుంచి తలపోట్లు ఎక్కువ కావడం మరింత ఇబ్బందికరంగా మారిందని కొందరు మానసికంగా ఎవరికీ చెప్పుకోలేక బాధపడుతున్నట్లు తెలుస్తోంది. కావున ఎప్పటికైనా ఆలస్యం కాకుండా వెంటనే జీతాలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సచివాలయాల డిప్యూటీ ఎంపీడీవోలు కోరుతున్నారు.

# అనాథలకు సాయం చేస్తే భగవంతునికి సేవచేసినట్లే



- బూదూరు వైసిపి నేత మినిగి బుజ్జిగ జక్కయ్య
- అనాథ ఆశ్రమానికి రూ. 20,000 ఆర్థికసాయం

మంత్రాలయం, ఫిబ్రవరి 03మనం, న్యూస్: :సమాజంలో ఉన్న అనాథలకు సాయంచేస్తే ఆభగవంతునికి సేవ చేసినట్టే అని బూదురు గ్రామ వైసిపి నేత మినిగి బుజ్జిగ జక్కయ్య అన్నారు. మంగళవారం ఆయన బూదూరు స్వగృహంలో ఎమ్మిగనూరులో ఉన్న పూలే అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అనాథ ఆశ్రమానికి రూ. 20,000 ఆర్థికసాయం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథలకు సాయంచేస్తే ఆ భగవంతుడు మన కుటుంబాలకు మేలులు చేస్తాడన్నారు.రబోయే కాలంలో తనాశక్తి మేరకు మేరకు సహాయం చేస్తానని అన్నారు.ఇలాంటి సేవ చేసే వారిని ప్రోత్సహించాలన్నారు. ఎమ్మిగనూరులోని పూలే అంబేద్కర్ సొసైటీ అనాథ ఆశ్రమం వ్యవస్థాపకులు సింగనేటి నరసన్న, సొసైటీ అధ్యక్షురాలు ప్రతిభా భారతి,సాతర్ల ప్రసాద్ కదిరి కోట సుందరాజు సామేల్,లకు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు జక్కయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

# మారేడుబాక పాఠశాలలో మంచి నీటి బోర్లు ఏర్పాటు



- తాగు నీరు కోసం కూటమి ప్రభుత్వం ముందడుగు

కుక్కునూరు, ఫిబ్రవరి 03 ( మనం న్యూస్): మండలంలొ స్థానిక గ్రామ పంచాయతీ అయిన గోపరాజు గూడెం లొ పాఠశాలలో మంచి నీరు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఇబ్బంది తెలుసుకున్న స్థానిక కూటమి నాయకులు ఆ గ్రామం లొ ఉన్న రెండు మంచినీటి బోర్లు ను ఎంపీపీ నిధులు ద్వారా మంచి నీటి బోర్లు ఏర్పాటు చెసి సమస్య పరిష్కారం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లీ తండ్రులు కూటమి నాయకులుకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమం లొ సర్పంచ్ మడకం తిరుపతమ్మ, ఎంపీటీసీ ముప్పాల శ్రీదేవి,టీడీపీ సీనియర్ నాయకులు ముప్పాల శివయ్య, జనసేన ఉపాధ్యక్షలు మంత్రి గోపాల కృష్ణ, టీడీపీ నాయకులు నరుకుల్లా సత్యనారాయణ, పెరసని లక్ష్మణ రావు, తూము రవి, వార్డ్ అప్కా రమాదేవి, కొలూరు శ్రీను, కేసరి రామకృష్ణ, అధికారులు ఏ ఇ వీరాస్వామి, పంచాయతీ కార్యదర్శి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఐసిడిఎస్ బడ్జెట్ పెంచి, అంగన్వాడీలకు కనీస వేతనం అమలు చెయ్యాలి

- ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు ధర్నా
- సిఐటియు నేత సాయికిరణ్ డిమాండ్




కుక్కునూరు,ఫిబ్రవరి 3 ( మనం న్యూస్): బడ్జెట్ పెంచి, అంగన్వాడీలకు కనీస వేతనం,సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చట్టం అమలు చెయ్యాలని సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. మంగళవారం నాడు ఐసిడిఎస్ కి బడ్జెట్ పెంచాలని అంగన్వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి సాయికిరణ్ మాట్లాడుతూ 2026-27 కేంద్ర బడ్జెట్లో 26 లక్షల మంది అంగన్వాడీ వర్కర్స్ మరియు హెల్పర్స్తో సహా దాదాపు ఒక కోటి మంది స్కీమ్ వర్కర్ల దుస్థితి మరియు హక్కులపై మాట్లాడకపోవడం అన్యాయం. ఐఇృఖి,ఇతర స్కీం వర్కర్లు కు ప్రాథమిక సేవల పథకాలలో మౌలిక సదుపాయాలు మరియు సేవల నాణ్యతపై బడ్జెట్ మౌనంగా ఉంది. కేటాయింపులలో ఎటువంటి పెరుగుదలలేదు. బడ్జెట్ మరియు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల ద్వారా 'అన్ని కార్మికులకు కనీస వేతనాలు అందిస్తున్నట్లు' గొప్పలు చెప్పుకుంటున్న భారత ప్రభుత్వం, అంగన్వాడీ కార్యకర్తలకు నెలకు కేవలం రూ.2700 మరియు అంగన్వాడీ సహాయకులకు నెలకు రూ.1350 వేతనంగా చెల్లిస్తోంది. 2018 నుండి సామాన్య ప్రజలకు ఆహారం, ఆరోగ్యం మరియు విద్య వంటి ప్రాథమిక సేవలను అందించే ఈ గ్రాస్ రూట్ స్థాయి కార్మికుల వేతనంలో ఎటువంటి పెరుగుదల లేదు. స్కీమ్ కార్మికులకు సామాజిక భద్రత లేదా పెన్షన్ లేదు. అంగన్వాడీ కార్యకర్తలు మరియు సహాయకులకు గ్రాట్యుటీ మంజూరు చేస్తూ 2022లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కూడా ప్రభుత్వం ఇంకా అమలు చేయలేదు, అయితే అంగన్వాడీలు ఉద్యోగులకు కూడా గ్రాట్యుటీ మంజూరు చేస్తున్నట్లు చెప్పి బడ్జెట్ కేటాయింపులు లేవు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి ఐసిడిఎస్ కి బడ్జెట్ పెంచి, అంగన్వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలని, గ్రాట్యుటీ చట్టం అమలు చేయాలని, అంగన్వాడీ సమస్యలు అన్ని పరిష్కరించాలని లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో ప్రాజెక్టు అధ్యక్షులు కుంజ నాగలక్ష్మి, కార్యదర్శి సువ్వేటి లత, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ పోచారపు వెంకటేశ్వర్లు, అంగన్వాడీలు అన్నపూర్ణ, మంగ, , పున్నమ్మ,లక్ష్మి,నయోమి,సుజాత,జ్యోతి,శ్యామల తదితరులు పాల్గొన్నారు.

# సూర్య మళ్లీ ఉదయించాడు..



మరికొన్ని రోజుల్లోనే టీ20 వరల్డ్‌కప్ 2026 భారత్, శ్రీలంక వేదికగా ప్రారంభం కానుంది. అయితే న్యూజిలాండ్ తో అయిదు టీ20 మ్యాచ్ ల సిరీస్ ముందు వరకు టీమ్ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫామ్ లేమిని భారత్ ను ఇబ్బందిపెట్టింది. కానీ కివీస్ తో పొట్టి సిరీస్ లో సూర్యకుమార్ యాదవ్ మూడు హాఫ్ సెంచరీలతో తన సత్తా చాటాడు. ఇందులో రెండు వరుస అర్ధ శతకాలున్నాయి. అలాగే ఈ సిరీస్ లో టాప్ స్కోరర్ గానూ నిలిచాడు.

సూర్యకుమార్ యాదవ్ 2025లో ఫామ్‌లేమితో తడ 'బ్యాటుం'కం గురయ్యాడు. టీ 20 వరల్డ్‌కప్ 2024 నుంచి.. డిసెంబర్ 2025 వరకు అతడు 28 ఇన్నింగ్స్ ల్లో 17.92 యావరేజ్ తో కేవలం 448 పరుగులే చేశాడు. ఇందులో రెండు అర్ధశతకాలు మాత్రమే ఉన్నాయి. 23 ఇన్నింగ్స్ ల వరకు సూర్య అసలు హాఫ్ సెంచరీనే చేయలేదు.

కివీస్ తో జరిగిన టీ20 సిరీస్ తో సూర్య తిరిగి రిథమ్లోకి వచ్చాడు. మొదటి మ్యాచ్ లో 32, రెండో టీ20లో 82* (కేవలం 37 బంతుల్లో), మూడో మ్యాచ్ లో 57*, అయిదో టీ20లో 63 పరుగులు సాధించాడు. నాలుగో మ్యాచ్ లో మాత్రం 8 రన్స్ చేశాడు. మొత్తానికి ఈ మూడు హాఫ్ సెంచరీల్లో రెండుసార్లు అజేయంగా నిలిచాడు. ముఖ్యంగా రాయ్ పుర్ వేదికగా జరిగిన రెండో టీ20లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. మూడో మ్యాచ్ లోనూ మరో అర్ధశతకం బాది తాను ఫామ్ లోకి వచ్చినట్లు నిరూపించాడు.

సూర్య మెరుపులు తోడైతే..

కివీస్ తో జరిగిన టీ20 సిరీస్ లో సూర్యకుమార్ యాదవ్ 80.66 యావరేజ్, 196.74 స్ట్రైక్ రేట్ తో 242 పరుగులు సాధించి, టాప్‌స్కోరర్ గా నిలిచాడు. విధ్వంసక ఓపెనర్ అభిషేక్ శర్మ (182 పరుగులు) కంటే కూడా ఎక్కువ రన్స్ సాధించడం గమనార్హం. టీ20 వరల్ కప్ 2026లో డిపెండింగ్ ఛాంపియన్ గా బరిలోకి దిగుతున్న భారత్ కు సూర్య ఫామ్ అదనపు బలం కానుంది. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ వీరబాదుడుకు సూర్య మెరుపులు తోడైతే.. స్కోర్ బోర్డ్ పరుగులెత్తడం ఖాయం. ప్రత్యర్థులు బిత్తరపోయి చిత్తవడం తథ్యం.. అని అభిమానులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

## 'పద్మ శ్రీ' అందుకోవడం నా జీవితంలో ఎంతో ప్రత్యేకమైన క్షణం: రోహిత్ శర్మ



భారత స్టార్ క్రికెటర్, మాజీ సారథి రోహిత్ శర్మ ఇటీవల 'పద్మ శ్రీ' అవార్డుకు ఎంపికయ్యాడు. తనకు ఈ పురస్కారం దక్కడంపై హిట్ మ్యాన్ తాజాగా స్పందించాడు. ''పద్మ శ్రీని అందుకోవడం నాకు, నా కుటుంబానికి ప్రత్యేకమైన క్షణం. ఈ గౌరవాన్ని అందించిన భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. క్రికెట్ కెరీర్ లో అండగా నిలిచిన వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నా. దేశం కోసం మ్యాచ్ లు, ట్రోఫీలు గెలవడానికి నా ప్రయత్నం ఎప్పుడూ కొనసాగుతుంది. ధన్యవాదాలు. జై హింద్'' అని రోహిత్ పేర్కొన్నాడు.

దూకుడైన బ్యాటింగ్ తో హిట్ మ్యాన్ గా పేరుతెచ్చుకున్న రోహిత్ శర్మ.. కెప్టెన్ గానూ భారత క్రికెట్ పై బలమైన ముద్ర వేశాడు. అతడి సారథ్యంలోనే టీమ్ఇండియా 2024లో టీ20 ప్రపంచకప్ ను గెలుచుకుంది. 2025లోనూ ఛాంపియన్స్ ట్రోఫీని కూడా చేజిక్కించుకుంది. రోహిత్ వన్డేల్లో 11577, టెస్టుల్లో 4301, టీ20ల్లో 4231 పరుగులు చేశాడు. అన్ని ఫార్మాట్లలో కలిపి 50 సెంచరీలు, 111 అర్ధసెంచరీలు సాధించాడు. టెస్టులు, టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన ఇతను వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. 2027 వన్డే వరల్ కప్ లో ఆడాలని లక్ష్యంగా పెట్టుకున్న రోహిత్.. ఇటీవల న్యూజిలాండ్ తో సిరీస్ లో పెద్దగా రాణించలేదు. అంతకుముందు సఫారీలతో జరిగిన మూడు వన్డేల సిరీస్ లో 146 పరుగులు చేశాడు.

## భారత్‌లో మళ్లీ ఫార్ములావన్!

భారత్‌లో మళ్లీ ఫార్ములావన్ కార్లు రయ్ రయ్ మంటూ దూసుకెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశంలో ఈ ఆటను పునరుద్ధరించడానికి ప్రభుత్వం ఆసక్తిని ప్రదర్శిస్తోంది. జేపీ గ్రూప్ ఆధ్వర్యంలో 2011లో గ్రేటర్ నోయిడాలోని బుద్ధా సర్క్యూట్ లో తొలిసారి ఎఫ్-1 రేసు జరిగింది. చివరగా 2013లో రేసు నిర్వహించారు. పన్నుల విషయంలో వివాదం, ఇతర సమస్యలతో భారత్ కు ఫార్ములావన్ దూరమైంది. ఫార్ములావన్ పునరుద్ధరణ కోసం కేంద్ర క్రీడల మంత్రి మన్ సుఖ్ మాండవీయ ఇప్పటికే బుద్ధా సర్క్యూట్ ను పరిశీలించారని.. ప్రస్తుతం ఈ రేసింగ్ ట్రాక్ నిర్వహణను చూస్తున్న యమున ఎక్స్ ప్రెస్ వే ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ అథారిటీ అధికారులతో మాట్లాడారని తెలిసింది. ఈ ట్రాక్ ను సొంతం చేసుకోవాలని అదానీ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అదే జరిగితే భారత్ లో మళ్లీ ఎఫ్-1 ట్రాక్ సందడిగా మారే అవకాశాలున్నాయి. ''ఎఫ్-1 రేసును నిర్వహించడం ఖర్చుతో కూడిన వ్యవహారం. ఆ సమస్య త్వరలో తీరుతుందని ఆశిస్తున్నాం. ఎఫ్-1 రేసును పునరుద్ధరించేలా చేస్తామని క్రీడల మంత్రి నిర్వాహకులకు భరోసా ఇచ్చారు'' అని భారత ఫార్ములావన్ వర్గాలు తెలిపాయి. ఎఫ్-1 రేసు నిర్వహించాలంటే ఏడాదికి రూ.200 కోట్ల నుంచి 500 కోట్ల వరకు వ్యయం అవుతుంది.

## వారికి నిద్ర ఎలా పడుతుంది: రకుల్ ప్రీత్ సింగ్

బాలీవుడ్ లో ఎప్పుడూ ఏదోఒక అంశం వైరల్ గా మారుతూనే ఉంటుంది. ఒకప్పుడు బంధుప్రీతిపై నటీనటులు వారి అభిప్రాయాలను పంచుకున్నారు. కొన్నిరోజుల క్రితం వర్కింగ్ అవర్స్ చర్చనీయాంశమైంది. ఇప్పుడు పీఆర్ వ్యవస్థపై అందరూ కామెంట్స్ చేస్తున్నారు. హిందీ చిత్ర పరిశ్రమలో పీఆర్ వ్యూహాలు మరో స్థాయికి చేరాయని పేర్కొంటున్నారు. తాజాగా నటి రకుల్ ప్రీత్ సింగ్ ఓ ఇంటర్వ్యూలో పబ్లిసిటీ సంస్కృతిపై స్పందించారు. ''పీఆర్ వ్యవస్థలు ఒక స్థాయి వరకూ మాత్రమే పనిచేయగలవు. మనం కష్టపడి పని చేసినప్పుడే దానికి తగిన ఫలితం వస్తుంది. గతంతో పోలిస్తే హిందీ చిత్ర పరిశ్రమలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. డబ్బు చెల్లించి ఇతరులపై బురద చల్లుతున్నారు. ఇంత నెగెటివిటీ సృష్టించే వాళ్లకు నిద్ర ఎలా పడుతుంది. వాళ్లకు మనస్సాక్షి ఉండదా అని ఎప్పుడూ అనుకుంటాను. ఇలాంటివారు ఎప్పటికైనా ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. నేను స్వయంగా ఎదిగి ఈ స్థాయికి వచ్చాను. నాకు పీఆర్ అవసరం లేదు'' అని అన్నారు.

ఇక ఫొటోగ్రాఫర్లపై కూడా రకుల్ అసహనం వ్యక్తంచేశారు. తాను ఒకే జీన్స్ ను నెలకు ఐదు సార్లు వేసుకుంటానని అన్నారు. ఈ విషయాన్ని కూడా ఫొటోగ్రాఫర్లు పరిశీలిస్తున్నారని, వారికి హద్దు ఉండాలని చెప్పారు. తాను దుస్తులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనని తెలిపారు.



## జోడీ రిపీట్



ధనుష్, సాయిపల్లవి జోడీ రిపీట్ అవుతోంది. ధనుష్ హీరోగా 'అమరన్' ఫేమ్ రాజ్ కుమార్ పెరియసామి దర్శకత్వంలో 'డీ 55'(వర్కింగ్ టైటిల్) సినిమా తెరకెక్కనుంది. వండర్ బార్ ఫిల్మ్స్, ఆర్ టేక్ స్టూడియోస్ సంస్థలు నిర్మించనున్న ఈ సినిమా చిత్రీకరణ త్వరలో ప్రారంభం కానుంది. ఈ మూవీలో ఓ హీరోయిన్ గా శ్రీలీల నటించనున్న విషయం తెలిసిందే.మరో హీరోయిన్ గా సాయిపల్లవి నటించనున్నట్లుగా సోమవారం ప్రకటించారు మేకర్స్. గతంలో 'మారి 2' (2018) చిత్రంలో ధనుష్, సాయిపల్లవి జోడీగా నటించిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఈ చిత్రంలోని 'రౌడీ బేబీ...' సాంగ్ కూడా అప్పట్లో బాగా పాపులర్ అయ్యింది.

అలాగే 'అమరన్ ' వంటి హిట్ మూవీ తర్వాత దర్శకుడు రాజ్ కుమార్ పెరియ సామితో సాయిపల్లవి చేస్తున్న రెండో సినిమా ఇది. ఈ చిత్రాన్ని ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారట ధనుష్ అండ్ టీమ్. ఈ సినిమాకు సంగీతం: సాయి అభ్యంకర్.

## ఫన్నీగా సూపర్ సుబ్బు టీజర్..




శృంగారం లేదా సెక్స్ ఎడ్యుకేషన్ అనే పదాలు వింటే చాలు చాలామంది అదేదో బూతులా చూస్తారు. అసలు ఈ పదాలు ఉచ్చరించడమే తప్పు అన్నట్లు ప్రవర్తిస్తారు. కానీ ప్రస్తుత జనరేషన్ లో వీటి గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చాలామంది పలు రకాలుగా అవగాహన తెచ్చుకుంటున్నారు. ఇప్పుడు ఇదే విషయంపై తెలుగులో ఓ వెబ్ సిరీస్ తీశారు. దాని టీజర్ ఇప్పుడు విడుదల చేశారు. 'సూపర్ సుబ్బు' పేరుతో తీసిన ఈ సిరీస్ లో సందీప్ కిషన్ లీడ్ రోల్ చేశాడు. నెట్ ఫ్లిక్స్ లో త్వరలో ఇది స్ట్రీమింగ్ కానుంది. ముంబైలో మంగళవారం ఓ ఈవెంట్ నిర్వహించిన సదరు ఓటీటీ సంస్థ.. అక్కడ దీని టీజర్ రిలీజ్ చేసిది. కాన్సెప్ట్ ఎలా ఉండబోతుందో రివీల్ చేసింది. టీజర్ బట్టి చూస్తే.. సుబ్బు.. చిన్నప్పటి నుంచి చిలిపి కుర్రాడు. పెద్దయిన తర్వాత కూడా అలానే ప్రవర్తిస్తుంటాడు. పెళ్లి చేస్తే దారిలోకి వస్తాడనుకుంటే ఏకంగా 60 మంది అమ్మాయిలు ఇతడిని రిజెక్ట్ చేస్తారు.


మరోవైపు సుబ్బుకి టీచర్ గా అవకాశమొస్తుంది. కాకపోతే ఓ పల్లెటూరిలో సెక్స్ ఎడ్యుకేషన్ గురించి చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీని వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నాడు? చివరకు వెళ్లిన పనిలో సక్సెస్ అయ్యాడా లేదా? అనేదే కాన్సెప్ట్ లా అనిపిస్తుంది. ఈ సిరీస్ లో సందీప్ కిషన్ కి జోడీగా మిథిలా పాల్కర్ నటించింది. మురళీ శర్మ, బ్రహ్మానందం తదితరులు కీలక పాత్రలు చేశారు.

## పారిశుద్ధ్య కార్మికురాలి నిజాయతీకి సూపర్ స్టార్ కానుక



తనకు దొరికిన బంగారాన్ని పోలీసులకు అప్పగించిన పారిశుద్ధ్య కార్మికురాలి నిజాయతీని సూపర్ స్టార్ రజనీకాంత్ మెచ్చుకోవడంతో పాటు బంగారు గొలుసును కానుకగా అందించారు. చెన్నై మహానగర పాలకసంస్థలో కార్మికురాలిగా పనిచేస్తున్న పద్మ (50) ఇటీవల తనకు రోడ్డుపై దొరికిన 45 తులాల బంగారాన్ని పోలీసులకు అప్పగించి పలువురు మన్ననలు అందుకున్నారు. తాజాగా ఆమెను అగ్ర కథానాయకుడు రజనీకాంత్ సన్మానించారు. తన ఇంటికి పిలిచి ఆమెతో ఆప్యాయంగా మాట్లాడిన రజనీకాంత్ ఆమెకు ఒక బంగారపు గొలుసును కానుకగా ఇచ్చారు.

ఇక పద్మకు భారత తపాలా శాఖ ఇటీవల అరుదైన గౌరవాన్ని అందించింది. ఆమె ఫొటోతో కూడిన ప్రత్యేక పోస్టల్ స్టాంపును విడుదల చేసింది. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ద్వారా ఆమెకు రూ.15 లక్షల ప్రమాద బీమా పాలసీని కూడా అందించారు. ఆమెను అభినందిస్తూ ప్రభుత్వం తరపున రూ.లక్ష నగదు బహుమతిని చెక్కు రూపంలో అందించించిన సంగతి తెలిసిందే.



## 'ది ప్యారడైజ్'.. కాన్ఫిడెంట్‌గా నాని అండ్ టీమ్..!

న్యాచురల్ స్టార్ నాని నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'ది ప్యారడైజ్' ఎప్పుడెప్పుడు రిలీజ్ అవుతుందా అని ప్రేక్షకులు ఆసక్తిగా చూస్తున్నారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాను పాన్ ఇండియా చిత్రంగా భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ఇక ఈ సినిమాలో నాని ఒక వైవిధ్యమైన లుక్ తో ప్రేక్షకులను ఎంటర్ టైన్ చేసేందుకు రెడీ అవుతున్నాడు.

అయితే, ఈ సినిమాకు సంబంధించి రోజుకో వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇప్పటికే ఈ సినిమా రిలీజ్ డేట్ విషయంలో పలు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ చిత్రాన్ని ముందుగా ప్రకటించినట్లు మార్చి 26న రిలీజ్ చేయరని తెలుస్తోంది. ఇప్పుడు ఈ సినిమా బడ్జెట్ అమాంతం పెరిగిపోయిందనే టాక్ వినిపిస్తోంది. కానీ, తమ కథపై మేకర్స్ ఫుల్ ధీమాగా ఉండటమే ఈ పుకార్లకు కారణమని సినీ సర్కిల్స్ లో చర్చ సాగుతోంది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రాన్ని తనదైన విజన్ తో రూపొందిస్తున్నాడు.

ఇక ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా ఎస్ఎల్ వి సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి ప్రొడ్యూస్ చేస్తున్నారు. మరి 'ది ప్యారడైజ్' మూవీపై వస్తున్న పుకార్లపై మేకర్స్ ఏదైనా క్లారిటీ ఇస్తారేమో చూడాలి.

## బాక్సాఫీస్ రికార్డులను పాతరపెట్టేందుకు సిద్ధమవుతున్న రణ్ వీర్ సింగ్..!



బాలీవుడ్ హీరో రణ్ వీర్ సింగ్ నటించిన 'ధురంధర్' ఇండియన్ బాక్సాఫీస్ దగ్గర సెన్సేషనల్ హిట్ చిత్రంగా నిలిచింది. ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ యాక్షన్ స్పై డ్రామా కళ్లు చెదిరే వసూళ్లను రాబట్టి బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. ఇక ఈ సినిమాకు సీక్వెల్ గా 'ధురంధర్ : ది రివెంజ్' చిత్రాన్ని తెరకెక్కించారు మేకర్స్. కాగా ఈ చిత్ర టీజర్ ను తాజాగా రిలీజ్ చేశారు.

ఈ టీజర్ ఆద్యంతం పవర్ ఫుల్ యాక్షన్ సీన్స్ తో నింపేశారు. రణ్ వీర్ సింగ్ మరోసారి ఇండియన్ బాక్సాఫీస్ ను చెడుగుడు ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. అయితే, ఈ సినిమాలో రణ్ వీర్ సింగ్ పాత్రకు సంబంధించిన ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్ కూడా ఉండబోతున్నట్లు ఈ టీజర్ చూస్తే అర్థమవుతుంది. రెండు వైవిధ్యమైన లుక్స్ తో రణ్ వీర్ సింగ్ ఈ టీజర్ లో కనిపించాడు. ఇక టీజర్ చివర్లో వచ్చే పవర్ ఫుల్ డైలాగ్ ఈ టీజర్ కే హైలైట్ గా నిలిచింది.

ఇక యాక్షన్ డోస్ కు ఏమాత్రం కొదువ లేదని ఈ టీజర్ కట్ చూస్తే అర్థమవుతుంది. ఈ సినిమాలో మాధవన్, సంజయ్ దత్, అర్జున్ రామ్ పాల్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని పాన్ ఇండియా భాషల్లో మార్చి 19న గ్రాండ్ రిలీజ్ కు రెడీ చేస్తున్నారు. 'ధురంధర్ 2' టీజర్ తో అప్పుడే ఈ సినిమాపై అదిరిపోయే అంచనాలు క్రియేట్ అవుతున్నాయి. మరి ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి విధ్వంసం సృష్టిస్తుందో చూడాలి.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.